బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...


# ఈ జీవితం ఎందుకు?

## తటవర్తి వీరరాఘవరావు



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# ఈ జీవితం ఎందుకు?



రచన & ప్రచురణ : తటవర్తి వీరరాఘవరావు

ప్రథమ ముద్రణ : డిశంబరు, 2015 ద్వితీయ ముద్రణ : నవంబరు, 2021


ప్రతులు : 3,000 ప్రతులు : 1,000

వెల : రూ. 50/-లు

పుస్తకముల కొరకు

**తటవర్తి వీర రాఘవరావు**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201. ప॥గో॥జిల్లా.
ఫోన్ : 08816 - 234353, సెల్ : 9440309812
email : balajipyramid.bvrm@gmail.com



# ధ్యానం చేసే పద్ధతి శ్వాస మీద ధ్యాస




ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమ క్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, కాళీ అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీ మండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండల శుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

## ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

వివరాలకు : ***తటవర్తి వీరరాఘవరావు,***
*తటవర్తి వారి వీధి, భీమవరం - 534 201.*
*సెల్ : 94403 09812, 94901 71853*

# ఈ జీవితం ఎందుకు?

ప్రతి మానవునిలో ఏదో ఒక రోజు ఈ ప్రశ్న ఉదయిస్తుంది. మామూలు సందర్భాలలో అనిపించకపోయినా... కష్టాలు వచ్చినప్పుడు, బాగా కష్టాలు పడుతున్నప్పుడు అనిపిస్తూ వుంటుంది. ఏమిటి ఈ జీవితం? ఎందుకు ఈ జీవితం? అసలు భగవంతుడు నన్ను ఎందుకు పుట్టించాడు? పుట్టించి నన్ను ఎందుకు ఇలా కష్టాలు పెడుతున్నాడు? అసలు పుట్టించక పోతే ఏ గొడవా లేదు కదా? అని అనుకుంటూ... బాధపడుతూ... అర్థం కాక అయోమయంలో కొట్టుమిట్టాడుతుంటారు.

దేనికి ఈ జీవితం? అన్నది చాలా మందికి జవాబు దొరకని ప్రశ్నగానే ఉంటుంది. అసలు ఈ జీవిత లక్ష్యం ఏమిటి? అంటే ఈ జీవితంలో ఏం చెయ్యాలి? ఏం సాధించాలి? అసలు జీవిత గమ్యమేమిటి? అంటే ఎక్కడికి ఈ జీవిత ప్రయాణం? చనిపోయే వరకేనా? లేక ఇంకా ఏమైనా వుందా? అసలు ఈ జీవిత ప్రయాణానికి అంతం వుందా? వుంటే ఎప్పుడు అంతమవుతుంది? అంటే ఎక్కడి వరకు ఈ జీవిత ప్రయాణం? అన్నది కూడా చాలా మందికి అర్థం కాదు.

కానీ చాలామంది ఈ జీవితంలో బాగా డబ్బు సంపాదించాల నుకుంటారు. అదే తమ జీవిత లక్ష్యమనుకుంటారు. ఇంకా కొంతమంది పెద్ద పెద్ద పదవులు అలంకరించాలనుకుంటారు. కొంతమంది పెద్ద హోదా గల ఉ ద్యోగం చెయ్యాలనుకుంటారు. కొంతమంది గొప్ప యాక్టర్ అవ్వాలని, మరికొంతమంది డైరెక్టర్అవ్వాలని, ఇంకొంతమంది సంగీతకారులు కావాలని, మరికొంతమంది మంచి సింగర్లు కావాలని, ఇంకా కొంతమంది మంచి ఆట గాళ్ళు కావాలని, ఇంకా కొంతమంది ఏదో ఒక రంగంలో గిన్నీస్ బుక్‌లోకి ఎక్కాలని, కొంతమంది సైంటిస్టులు కావాలని, కొంతమంది సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలని, ఇలా రకరకాలుగా జీవితంలో ఎదగాలని, ఎన్నో సాధించాలని అనుకుంటూ వుంటారు. అదే తమ జీవిత లక్ష్యమని... జీవితంలో చేయవలసింది అదేనని భావించేవారు కూడా వున్నారు.

అందుకే కొంతమంది నా జీవితంలో ఆ మెడల్ సాధిస్తే చాలు అని,

ఇంకా కొంతమంది ఆ అవార్డు గెలుచుకుంటే చాలు అని అనుకుంటారు. ఇంకా కొంతమంది అంత రివార్డు సంపాదిస్తే చాలు అనుకుంటారు, కొంతమంది అంటూంటారు కూడా. నా జీవితానికి అది సాధిస్తే చాలురా! ఇంకేమీ అక్కర్లేదు అంటారు. ఇంకా కొంతమంది సొంతంగా ఒక ఇల్లు కట్టగలిగితే చాలు అనేవారు వున్నారు. ఇంకా కొంతమంది యీ జీవితంలో ఏ లోటూ లేకుండా వెళ్ళిపోతే అంటే చనిపోతే చాలు అంటారు.

ఇంకా కొంతమంది మా పిల్లలకు దారి చూపిస్తే చాలు అంటారు. ఇంకా కొంతమంది ఈ జీవితంలో ఆ పదవి సంపాదిస్తే చాలు అనుకుంటారు. ఇంకా కొంతమంది ఈ జీవితంలో ఏదైనా గుర్తుండిపోయే పని చేస్తే చాలు అనుకుంటారు. ఇంకా కొంతమంది ఈ జీవితంలో పది మందికి ఉపయోగపడే పనులు చేస్తే చాలు, సేవ చేస్తే చాలు అనుకుంటారు. ఇంకా కొంతమంది అనుభవించడానికే ఈ జీవితం అనుకుంటారు. ఇంకా కొంతమంది ఆనందం కోసమే ఈ జీవితం అనుకుంటారు. అలా రకరకాలుగా అనేవారు, అనుకునే వారు వున్నారు.

కానీ అసలు ఈ జీవితం ఎందుకు? అందుకోసమేనా? అని ప్రశ్నిస్తే ధీమాగా జవాబు చెప్పగలిగిన వారు చాలా తక్కువ మంది వుంటారు. ఎందుకు ఈ జీవితం? అన్న ప్రశ్నకు సరైన సమాధానం తెలుసుకోవాలనే ఆసక్తి చాలా మందిలో వుంటుంది. అందుచేత ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవటానికి ప్రయత్నిద్దాం.

ఈ ప్రశ్నకు సమాధానం పొందాలంటే ముందుగా మనమెవరో తెలుసుకోవాలి. మనమెవరో తెలియకపోతే ఈ ప్రశ్నకు సరియైన సమాధానం దొరకదు. కారణం మనమెవరో తెలిస్తేనే జీవితం ఎందుకు? అన్న ప్రశ్నకు సరైన సమాధానం తెలుస్తుంది.

మరి మనం ఎవరం? అంటే దేహధారులం. అంటే దేహాలను ధరించినవారం. అంటే దేహాన్ని ధరించిన 'ఆత్మలం'. అంటే మనం 'ఆత్మలం'. అంతే కానీ దేహాలము కాదు అన్నది ముందు తెలుసుకోవాలి.

ఎందుచేతనంటే నేను దేహం అన్న అవగాహనలో వుంటే ఈ ప్రశ్నకు సరైన సమాధానం దొరకదు. నేను ఆత్మను అన్న సత్యాన్ని తెలుసుకున్నప్పుడే,

అవగాహనలో వున్నప్పుడే ఈ జీవితం ఎందుకు? అన్న ప్రశ్నకు సరైన సమాధానం లభిస్తుంది. కారణం నేను దేహం అన్న భావనలో వున్న వారికి జీవితం ఎందుకు? అన్నదానికి ప్రాపంచికమైన సమాధానమే లభిస్తుంది. ప్రాపంచికంగా ఆలోచిస్తే అదే ప్రశ్నకు ఎన్నో సమాధానాలు వస్తాయి. చివరకు ఏది కరెక్టో అర్థం కాదు. ప్రస్తుతం ఎక్కువ శాతం మానవులు నేను దేహం అన్న అవగాహనలోనే వున్నారు కాబట్టి ఈ ప్రశ్నకు సరైన సమాధానం లభించడం లేదు. పైగా ఒక్కొక్కరు ఒకో రకమైన సమాధానం చెపుతూ వుంటారు.

ఎందుచేతనంటే ఈ ప్రశ్నకు సమాధానం ప్రాపంచిక జీవితం జీవించే వారికి తెలియక పోవచ్చు, కానీ ఆధ్యాత్మికంగా జీవించిన యోగులు, ఆత్మజ్ఞానులు ఈ ప్రశ్నకు తేలికగా సమాధానం చెప్పగలరు. కారణం వారు ఈ సృష్టిలో కనిపించే వాటి గురించే కాక కనిపించని వాటి గురించి కూడా బాగా తెలుసుకున్నారు కాబట్టి, అధ్యయనం చేసారు కాబట్టి.

అలాంటి ఆధ్యాత్మిక వేత్తలలో అగ్రగణ్యులైనటువంటి శ్రీకృష్ణుడు, బుద్ధుడు, మహావీరుడు, శ్రీ ఆదిశంకరాచార్యులు, గురునానక్, జీసస్, మహమ్మద్, పత్రీజీ లాంటి యోగపుంగవులు. వ్యాసభగవానుడు, వశిష్టులు, విశ్వామిత్రుడు, వాల్మీకి, యాజ్ఞవల్క్యుడు లాంటి బ్రహ్మర్షులతో పాటు ఈనాటి ఆత్మజ్ఞానులు వివేకానంద, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, యోగివేమన, కబీర్, షిరిడీబాబా, మెహర్‌బాబా, సత్యసాయిబాబా లాంటి వారెందరో ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడమే కాకుండా అసలు మానవ జీవిత లక్ష్యం సాధించమని, జీవితగమ్యం చేరుకోమని బోధించారు. బోధించడమే కాకుండా ఆ మార్గాన్ని కూడా వారు మానవులకు తెలియజేయడం జరిగింది.

అందుచేత ప్రస్తుతం మనం కూడా ఈ జీవితం ఎందుకు? అన్న ప్రశ్నకు సమాధానం తెలుసుకుందాం. ఈ ప్రశ్నకు సమాధానం దొరకాలంటే మనం మరి కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. వాటికి సమాధానం కూడా తెలుసుకోవాలి. అందుచేత ఆ ప్రశ్నలు, వాటికి సమాధానాలు ఏమిటో తెలుసుకుందాం. తరువాత వాటిని విపులంగా విశ్లేషించుకుందాం.

ప్ర: ఈ జీవితం ఎందుకు?

జ : చేసిన కర్మలు అనుభవించటానికి.

ఇక్కడితో ఆపేస్తే అసలైన పూర్తి సమాధానం లభించదు. అందుచేత మరికొన్ని ప్రశ్నలు వేసుకుందాం.

ప్ర: కర్మలు ఎందుకు అనుభవించాలి?

జ : అనుభవిస్తూ అనుభవం పొందటానికి.

ప్ర : అనుభవం ఎందుకు పొందాలి?

జ : జీవిత పాఠాలు నేర్చుకోవటానికి.

ప్ర : జీవిత పాఠాలు ఎందుకు నేర్చుకోవాలి?

జ : జ్ఞానం సంపాదించుకోవటానికి.

ప్ర : జ్ఞానం ఎందుకు సంపాదించుకోవాలి?

జ : ఆధ్యాత్మికంగా, ఆత్మపరంగా ఎదగటానికి.

ప్ర : ఆత్మపరంగా ఎందుకు ఎదగాలి?

జ : జీవిత గమ్యం చేరటానికి, జీవిత లక్ష్యం సాధించటానికి.

ప్ర : జీవిత గమ్యం ఏమిటి?

జ : జీవిత గమ్యం సత్యలోకం చేరడం.

ప్ర : జీవిత లక్ష్యం ఏమిటి?

జ : జీవిత లక్ష్యం పూర్ణాత్మగా తయారు కావడానికి, బ్రహ్మంగా శేషించడానికి, పరమాత్మగా విలసిల్లడానికి.

పై సమాధానాలను మనం వివరంగా, లోతుగా విశ్లేషించుకుందాం.

ముఖ్యంగా మనమంతా సత్యలోక వాసులైన పూర్ణాత్మ నుండి అంటే బ్రహ్మం నుండి అంటే భగవంతుని నుండి విడివడిన అంశలం అంటే అంశాత్మలమని తెలుసుకోవాలి. అలా అంశగా అంటే భాగంగా విడివడిన ఆత్మలమైన మనం ఒక దేహంలో అంటే జీవుడిలో ప్రవేశించాం. అందుకే జీవాత్మగా లేక జీవుడిగా పిలువబడుతున్నాం.

అలా తల్లి గర్భంలో తయారయ్యే, దేహంలో ప్రవేశించిన మనం, నవ మాసాలు పూర్తి అయిన తరువాత జన్మిస్తాం. మొట్టమొదటిసారిగా అలా జన్మించి జీవితంలో ప్రవేశించిన మనకి కర్మ చక్రం ప్రారంభమవుతుంది. అంటే కర్మలు చెయ్యడం ప్రారంభిస్తాం. అలా ఎదుగుతున్న కొద్దీ ప్రతీ రోజూ ఎన్నో కర్మలు చేస్తూ వుంటాం. అలా చేస్తూన్న కర్మలనే 'వర్తమాన కర్మలు' అంటారు. అలా చేస్తున్న కర్మలు అనుభవించినవి అనుభవించగా మిగిలిన కర్మలు మనం చనిపోయిన తరువాత అంటే శరీరం వదలినపుడు మన ఖాతాలో జమ చేయబడతాయి. అలా జమ చేయబడిన కర్మలనే 'సంచితకర్మలు' అంటారు.

అలా సంచితంగా వున్న కర్మలు ఎవరైనా అనుభవించవలసిందే! అందుచేత ఆ కర్మలు అనుభవించటానికి అందులోంచి కొన్ని కర్మలు తీసుకుని (వీటినే ప్రారబ్ధ కర్మలు అంటారు) మరల జన్మ అంటే జీవితం తీసుకుంటాం. అలా జీవితం తీసుకుని ఆ ప్రారబ్ధ కర్మలు అనుభవిస్తూంటాం. అలా అనుభవిస్తూ మరల కొత్తగా కర్మలు చేస్తూంటాం. ఈ కర్మలు కూడా అనుభవించవలసినవి అనుభవించగా మిగిలినవి చనిపోయిన తరువాత పాత సంచితంలో కలుస్తాయి. ఆ మొత్తంలో నుంచి కొన్ని ప్రారబ్ధ కర్మలతో మరల కొత్త జన్మ తీసుకుంటాం. అలా జన్మ పరంపర కొనసాగుతూ వుంటుంది. అలా ఎంత వరకు ఈ జీవితం కొనసాగుతుంది? అంటే మన ఖాతాలో కర్మలు వున్నంత వరకు. ఈ జీవితం కొనసాగుతుంది. కారణం చేసిన కర్మలు అనుభవించాలి కదా?

అందుకే జీవితం దేనికి? అంటే చేసిన కర్మలు అనుభవించటానికి అని చెప్పుకున్నాం.

మనకు మరొక సందేహం వస్తుంది. అసలు చేసిన కర్మలు ఎందుకు అనుభవించాలి? అంటే అనుభవిస్తూ అనుభవం పొందటానికి అని చెప్పుకున్నాం.

దీని గురించి కూడా కొంచెం తెలుసుకుందాం.

ఈ సృష్టిలో వున్న 84 లక్షల జీవులు, జీవరాశులు అన్నీ భగవంతుని నుంచి ఉద్భవించినవే. కాబట్టి అన్నీ భగవంతుని రూపాలే. అందుచేత అందరూ ఒకటే అన్న సత్యం ముందు మనం అర్థం చేసుకోవాలి. ఇక్కడ ఎక్కువ, తక్కువ అంటూ ఎవరూ లేరు. అంతా సమానమే. ఈ విషయమే "ఈశావాస్య ఉపనిషత్"లో చెప్పబడింది.

**శ్లో॥ "ఈశావాశ్యమిదం సత్యం యత్కించ జగత్యాం జగత్**
**తేనత్యక్తేన భుంజిథామాగృధః కస్యస్విద్ధనమ్ ।"**

తా:– ఈ సమస్త సృష్టిలో ఏ చరాచర ప్రపంచం వుందో అదంతా భగవంతుని చేత వ్యాప్తం అంటే అంతా భగవంతుడే, అంతా భగవంతునిదే కాబట్టి ఈశ్వరమయమైన ఈ ప్రపంచాన్ని త్యాగభావంతో అనుభవించు, ఎవరి ధనాన్ని ఆశించకు, ఎవరినీ హింసించకు.



ఈ విషయమే భగవద్గీతలో కూడా చెప్పబడింది.

**శ్లో॥ అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున**
**విష్టభ్యాహ మిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్॥**
**(భ.గీ.10-42)**

తా:– అర్జునా! విస్తారమైన ఈ జ్ఞానముచే నీకేమి ప్రయోజనము ఈ జగత్తునంతా నేనే వ్యాపించి వున్నానని తెలుసుకొనుము.

అలా అన్నీ తానేనని చెప్పడం జరిగింది.

ఆయన ఇంకా

**శ్లో॥ మయా తతమిదం సర్వం జగ దవ్యక్తమూర్తినా**
**మత్ స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః (భ.గీ.9-4)**

తా:– నేను నా అవ్యక్త రూపంతో ఈ జగత్తు నంతా వ్యాపించి వున్నాను. సమస్త ప్రాణికోట్లు నా యందు వున్నవి.

అలా చెపుతూ తాను చెప్పింది నిరూపిం చడానికి అర్జునునకు తన అసలు రూపం అంటే విశ్వరూపం చూపించడం జరిగింది.

**శ్లో॥ పశ్య మే పార్థ రూపాణి శతశోథ సహస్రశః**
**నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ (భ.గీ.11-5)**

తా:- ఓ అర్జునా! అనేక విధములుగ నున్నవియు, అలౌకికమైనవియు, వివిధ వర్ణములు, ఆకారములు గలవియు, అసంఖ్యాకములుగ వర్తించునవియునగు నా యొక్క రూపములను గాంచుము.

అందుచేత ముందు అంతా భగవత్ స్వరూపాలే అంతా ఒక్కటే అని తెలుసుకోవాలి. కారణం ఈ సృష్టిలో 84 లక్షల రకాల జీవులు, జీవరాశులు ఉన్నాయని చెపుతూ వుంటారు. అందులో వృక్షజాతి, క్రిమికీటక జాతి, పక్షిజాతి, జంతు జాతి, మానవజాతి లాంటివి ఎన్నిటినో మనం చూస్తున్నాం. అన్నీ వివిధ రూపాలతో, వివిధ ఆకారాలతో మనకు కనిపిస్తాయి.


కానీ లోకంలో అటువంటి వివిధ రూపాలను చూస్తూ అందరూ, అన్నీ వేరువేరు అని భావిస్తున్నారు. అంతేకాదు తానే గొప్పవాడినని భావిస్తూ తన




ఆనందం కోసం, తన సుఖం కోసం ఇతరులను, ఇతర జీవులను హింసిస్తు న్నారు. అనేక రకాలుగా భాధిస్తున్నారు. ఇతరులను మోసగిస్తూ, అవమానిస్తూ, కించపరుస్తూ, ఇతరులవి అపహరిస్తూ, ఎవరి ఇష్టం వచ్చిన రీతిలో వారు ప్రవర్తిస్తున్నారు. ఇలా ప్రవర్తించడం వల్ల అల్పులు, బలహీనులు, అబలలు

బాధకు గురి కావలసి వస్తుంది. తమ ఆనందాన్ని కోల్పోవలసి వస్తుంది. అన్నీ భగవత్ స్వరూపాలైనపుడు, అలా ప్రవర్తించడం, ఇతరుల ఆనందాన్ని హరించడం సృష్టి ధర్మానికి విరుద్ధం.

ఈ సృష్టిలో ప్రతి ఒక్క జీవికి ఆనందంగా జీవించే హక్కు వుంది. ఇతర జీవుల ఆనందాన్ని హరించే హక్కు ఎవరికీలేదు. ఎందుచేతనంటే బాధ అనేది ప్రతి జీవికి ఒకటే. ఇది చెప్తే తెలియదు, అనుభవిస్తేనే తెలుస్తుంది, అపుడే అర్థమవుతుంది, ప్రవర్తనలో మార్పు వస్తుంది. ఎందుచేతనంటే బాధ తెలిస్తే బాధపెట్టరు. తిరిగి అలాంటి పని చేయరు. అందుచేత తప్పులు చేస్తే తిరిగి అనుభవించాలి. తప్పులు చేసే వారికి తాము చేసేది తప్పని తెలియాలి.




లేకపోతే తప్పులు చేయడం మానరు.

మరి ఇలా బలహీనులపై దౌర్జన్యం ఎందుకు చేస్తున్నారు? ఎందుకు ఇలా అధర్మంగా ప్రవర్తిస్తున్నారు? అంటే అలా బాధపడిన వారి బాధ ఎలా వుంటుందో వీరికి తెలియదు కనుక. అటువంటి బాధే తాను అనుభవిస్తే, ఆ బాధ ఎంత నరకమో? ఎంత దుర్భరమో? అన్నది తన అనుభవంలోనికి వస్తే అంటే తాను అనుభవిస్తేనే తెలుస్తుంది. అపుడు ఇతరుల పట్ల అలాంటి పనులు, అలాంటి హింస చెయ్యమన్నా చెయ్యరు.

అయ్యో! వారి బాధ కూడా తన బాధలాంటిదే కదా? నేను ఎంత

బాధపడ్డానో వారు నా వల్ల అంత బాధ అనుభవించవలసి వస్తుంది కదా? అని ఆ పని చెయ్యడానికి సందేహిస్తారు, వెనకాడతారు, ఆ పని చెయ్యరు కూడా!

ఇలాంటి మార్పు ఎవరికి వారు స్వయంగా అనుభవంలోకి తెచ్చుకున్నప్పుడే జరుగుతుంది.

అందుకే నైజీరియా సామెత ఏమని చెపుతుందంటే "పక్షి పిల్లను కొనతేలిన పుల్లతో పొడిచే ముందు అదెంత గాయ పరుస్తుందో తెలుసుకునేందుకు నిన్ను నువ్వు పొడిచి చూసుకో".

అంతేకానీ ఊరికే నోటితో ఆ పని చెయ్యకు, అలా వారిని బాధించకు, ఆ పక్షిని హింసించకు, ఆ జంతువుని చంపకు, అది నీలా బాధపడుతుందని ఎంత చెప్పినా వినరు. పైగా వితండవాదం చేస్తారు. నాకు అన్నీ తెలుసులే! అంటారు. కారణం ఇతరుల, ఇతర జీవుల బాధ ఎలా వుంటుందో వారికి స్వయంగా అనుభవంలోకి రాలేదు కాబట్టి. కానీ తాను స్వయంగా ఆ బాధ అనుభవించినప్పుడు తప్పనిసరిగా వారిలో పరివర్తన కలుగుతుంది, మార్పు వస్తుంది.

ఉదాహరణకు ఎవరైనా కక్షతో ఒకరి కాలు నరికాడనుకుందాం. మరు జన్మలో పుట్టుకతోటే అవిటివాడుగా పుట్టవచ్చు. పోలియో లాంటి వ్యాధుల వల్ల కాలు పని చేయకపోవచ్చు. లేదా ఏదైనా ఏక్సిడెంట్లో కాలుపోవచ్చు. అలా ఏదో ఒక రకంగా కాలు పోగొట్టుకుని కాలు లేకుండా జీవించవలసి వస్తుంది. అలా జీవించడం ఎంత కష్టమో! ఎంత దుర్భరమో! స్వయంగా అనుభవించడం వల్ల అనుభవం పొందుతాడు. అపుడు వాడికి కాలు లేని బాధ ఎలా వుంటుందో తెలుస్తుంది. అందుచేత ఆ తరువాత జన్మలలో ఎవరి కాలు నరకడు. ఎవరిని అటువంటి బాధకు గురి చెయ్యడు. కారణం ఆ అనుభవం పొందాడు కనుక.

అలాగే ఈ జన్మలో అంద వికారంగా వున్న ఆమెను చూసి ఒకావిడ అసహ్యించుకుని అవమానించి, చులకనగా చూసి, నేనే అందగత్తెనని గర్వించి, అహంకారంతో వ్యవహరిస్తే, మరుజన్మలో కురూపిగా జన్మించవలసి వస్తుంది. ఆ జన్మంతా ఎన్నో రకాల ఛీత్కారాలతో, అందం లేదని చులకనగా చూడటం లాంటి అవమానాలు భరించవలసి వస్తుంది. అందం లేని వారి జీవితం ఎంత

బాధాకరమో! అనుభవించడం వల్ల అనుభవంలోకి వస్తుంది. ఆ తరువాత జన్మలలో అటువంటి వారిని చూసినా అవమానించరు, చులకనగా చూడరు. అటువంటి వారికి బాధ కలిగించరు. కారణం అనుభవం పొందటం వల్ల.

అలాగే తక్కువ కులమని అవమానిస్తే అటువంటి కులంలో జన్మించవలసి వస్తుంది. ఇతర మతాన్ని దూషిస్తే అదే మతంలో జన్మించవలసి వస్తుంది. ఇతర ప్రాంత వాసులను, దేశ వాసులను విమర్శిస్తే అలాంటి ప్రాంతంలో, అలాంటి దేశంలో జన్మించి, అలాంటి అనుభవాలు పొందవలసి వుంటుంది.

అనుభవం ఎలాంటి మార్పు తీసుకు వస్తుందో, ఎంతటి గుణపాఠం నేర్పుతుందో చిన్న ఉదాహరణ చూద్దాం.

పాకడం వచ్చిన ఏ పిల్లవాడైనా దూరంగా వున్న మంటను చూసి ఏమిటో అని పట్టుకోవటానికి ఆ మంట వైపు వెళ్తూ వుంటాడు. కారణం ఆ వయస్సులో ఏ వస్తువైనా చేత్తో పట్టుకుంటే కానీ వారికి తృప్తి వుండదు. అలా వెళ్తున్న వారిని ఏ తల్లి అయినా హెచ్చరిస్తుంది, వెళ్ళవద్దని వారిస్తుంది. అయినా వాడు మంటను పట్టుకోవాలన్న ఆత్రంతో ఇంకా వేగంగా అటువైపు పాకుతూంటాడు. అపుడు తల్లి గబగబా లేచివచ్చి పిర్రల మీద మెల్లిగా ఒకటి తగిలించి వెనక్కు తీసుకువస్తుంది. కానీ తల్లి ఏమరుపాటుగా వుంటే ఆ పిల్లవాడు మళ్లీ అటువైపు వెళ్ళటానికి ప్రయత్నిస్తాడు.

కానీ ఏదయితే అది అవుతుందని ఆ తల్లి వదిలేసిందనుకోండి, వాడు మంట దగ్గరకు వెళతాడు. అందులో చెయ్యి పెడతాడు, చెయ్యి కాల్చుకుంటాడు. ఆ కాలిన బాధ భరించలేక విపరీతంగా ఏడుస్తాడు కూడా! కానీ చూడండి వాడికి ఆ గాయం మానాక మరల మంట కనిపిస్తే వెళతాడా? అంటే చచ్చినా వెళ్ళడు. ఇప్పుడు వాడిని హెచ్చరించవలసిన అవసరం కూడా వుండదు, వారించవలసిన పని లేదు. అంతేకాదు వెళ్ళమన్నా కూడా వెళ్ళడు.

చూడండి ఇంతకు ముందు వద్దంటే వినలేదు. కారణం అపుడు అనుభవం కాలేదు. ఇప్పుడు వెళ్ళమన్నా వెళ్ళడు కారణం అనుభవమైంది కాబట్టి. అందుచేత ఎవరైనా సరే, ఏదైనా సరే అనుభవంలోకి వస్తేనే వారి ప్రవర్తనలో మార్పు వస్తుంది, బాగా తెలుసుకుంటారు, అర్థం చేసుకుంటారు. అంతేకానీ

ఊరికే చెబితే వినరు, మారరు, ప్రవర్తన మార్చుకోరు.

అలాగే ఈ సృష్టిలో అంతా ఒకటే, అంతా నీలాంటి వాళ్ళే. నీ బాధ ఎలాంటిదో వారి బాధ కూడా అలాంటిదే అని పెద్దలు ఎన్ని నీతిబోధలు చేసినా, ఎంత చెప్పినా ఎవరూ వినరు, మారరు. వారి హింసా ప్రవర్తన మార్చుకోరు. కానీ అనుభవం పొందితే ఎవరూ చెప్పవలసిన పని లేకుండా అర్థం చేసుకుంటారు, తన ప్రవర్తన మార్చుకుంటారు.

ఉదాహరణకు జీవహింస చేయవద్దు, మాంసం తినవద్దు, కోళ్ళను, పక్షులను చంపవద్దు, జంతువులను హింసించవద్దు, చేపలను తినవద్దు అని చెపితే వింటారా? ససేమిరా వినరు. పైగా ఎన్నో రకాల వ్యాఖ్యానాలు చేస్తారు.

సుఖపడకపోతే ఎలా? సుఖపడటానికేగా సంపాదించేది? అని కొందరు. మాంసం తినకపోతే బలం ఎలా వస్తుంది? పనులు ఎలా చేసుకుంటాం? అని కొందరు, అసలు ఆ రుచి ఎలా వుంటుందో నీకు తెలిస్తే కదా? తింటే తెలుస్తుంది? అని కొందరు, అసలు పచ్చగడ్డిలో ఏముంది? ఫలావులోనే రుచి అంతా వుంది, పండగకి వస్తే పప్పన్నం పెడతావా? అని అనేవాళ్ళు కొంతమంది.

అలాగే వాటన్నిటినీ భగవంతుడు మన కోసమే సృష్టించాడు. మనం అనుభవించడానికే అవి వున్నాయని మరి కొందరు అంటారు, మనం తినకపోతే అవి పెరిగిపోవా? అని కొందరు, తోటకూరలో కూడా ప్రాణం వుందట కదా? మరి అది తింటే పాపం కానపుడు మాంసం తింటే పాపం ఎలా అవుతుంది? అని కొందరు.

ఇప్పుడే తింటున్నమా? తరతరాల నుంచి అందరూ తింటున్నారు కదా? ఎక్కడ చూసినా అంతా మాంసాహారమే కదా తినేది? మరి తప్పయితే అందరూ ఎందుకు తింటారు? అని కొందరు. షిరిడీ బాబా మాంసం వండాడట? భక్త కన్నప్ప మాంసం పెట్టాడట? ఖురాన్‌లో మాంసం తినమని వుందట? జీసస్ చేపలు పెట్టాడట? లాంటి ప్రశ్నలు వేసేవారు కొంతమంది.

ఇలా రకరకాల కారణాలు చెపుతూ, ప్రశ్నలు వేస్తూ, వాదనలు చేస్తూ మాంసం తినేవారు చాలా మంది వున్నారు.

అలా మాంసం తింటూ పరోక్షంగా హింసకు కారణమవుతున్నారు. కానీ సృష్టి ధర్మం ప్రకారం హింస పాపం, పాపానికి ఫలితం అనుభవించాల్సి



వస్తుంది. పాప ఫలితం రోగాల రూపంలో అనుభవించేటపుడు చాలా బాధాకరంగా వుంటుంది, అది నరకంతో సమానమని తెలుసుకోవాలి.

అందుకే బుద్ధ భగవానుడు ఈ రకంగా చెప్పడం జరిగింది.

**“పాపం చేసేటపుడు ఎవరికైనా సుఖభ్రాంతి వుంటుంది. కానీ ఆ పాప ఫలితం అనుభవించే టపుడు మాత్రం జీవితం కడు దుర్భరంగా వుంటుంది”** అని అన్నారు.

మరి దుర్భరమైన బాధ కలిగించే పాపం ఎందుకు చేస్తున్నారు? అంటే ఆ అనుభవం ఇంకా పొందలేదు కాబట్టి. అందుకే పాపం అని చెప్పినా కూడా పాపాలు చేస్తున్నారు.

అంతేకాదు పాపాలు చేస్తే కష్టాలు వస్తాయని, జీవితం కడు దుర్భరమవుతుందని ప్రతి ఒక్కరికి తెలుసు. అందుకే పాపాలు క్షమించమని దేవుళ్ళను ప్రార్థిస్తున్నారు, వేడుకుంటున్నారు. పాపాలు పోతాయని చెపితే ఏ పనైనా చేస్తున్నారు. నదులలో మునుగుతున్నారు, పుణ్యక్షేత్రాలు దర్శిస్తున్నారు, ఇంకా ఎన్నో పనులు చేస్తున్నారు.

ఏ మతం వారైనా ఆలయాలకు వెళ్ళి వారి ఆచారం ప్రకారం పూజలు, ప్రార్థనలు, నమాజులు, ఆరాధనలు చేసి పాపాలు క్షమించమని కోరుతున్నారంటే పాపాలు చేసారనే కదా అర్థం? పాపాలు చేసామని తమంత తాము ఒప్పుకుంటు న్నట్టే కదా? మరి పాపాలే చెయ్యకపోతే క్షమించమని కోరడమెందుకు? ప్రార్థించడ మెందుకు?

ఇవన్నీ చేస్తున్నారంటే పాపాలు చేసామని ఒప్పుకోవడమే కాదు, పాపాల వల్ల కష్టాలు వస్తాయని కూడా తెలుసు. ఆ కష్టాలు భరించలేమని, అవి చాలా బాధాకరమని కూడా తెలుసు కాబట్టే! క్షమించమని కోరుతున్నారు.

మరి తెలిసి కూడా ఎందుకు పాపాలు చేస్తున్నారు? ఇతరులను, ఇతర జీవులను ఎందుకు హింసిస్తున్నారు? ఇతరులను ఎందుకు మోసగిస్తున్నారు?

నష్టపరుస్తున్నారు? కష్టాలకు గురి చేస్తున్నారు? ఇతరుల పట్ల చేయకూడని పనులు ఎందుకు చేస్తున్నారు? అధర్మంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు? సృష్టి విరుద్ధమైన పనులు ఎందుకు చేస్తున్నారు? అలా చేస్తూ జీవితాన్ని ఎందుకు నరక ప్రాయం చేసుకుంటున్నారు?

అంటే ఎంత తెలిసినా అనుభవం కాలేదు కాబట్టి ఆ పనులు మానలేక పోతున్నారు, కష్టాలు తెచ్చుకుంటున్నారు.

ఉదాహరణకు ధనం అపహరించవద్దు అని పెద్దలు చెపుతూ వుంటారు. ఇది విన్నా కూడా వాడికి అర్థం కాదు. డబ్బు కోసం ఎవడి జేబో కత్తిరించాడనుకుందాం, ఎవరి మెడలోనో గొలుసు కాజేసాడనుకుందాం, ఎవరి సెల్, బైక్, కారు లాంటివి అపహరించాడనుకుందాం. దొరకనపుడు బాగానే వుంటుంది. కానీ వాడి పాపం పండి దొరికాడనుకోండి. పట్టుకుని అందరూ ఒళ్ళు హూనం చేస్తారు, దొంగ, దొంగ అని హేళన చేస్తారు, తిడతారు, చాలా నీచంగా చూస్తారు, పోలీసులకు దొరికితే కఠినమైన శిక్షలు పడతాయి.

ఆ అనుభవం అయినప్పుడు తెలుస్తుంది. అది ఎంత అవమానకరమో! బాధాకరమో.! అది భరించలేక ఇక అలాంటి పని చేయకూడదని నిర్ణయించుకుంటారు, చేయరు కూడా. కారణం అనుభవమయ్యింది కాబట్టి. అనుభవం పొందిన వారు జీవించడం కష్టమైనా అలాంటి తప్పులు చెయ్యరు. కారణం స్వానుభవం. ఒకవేళ చేద్దామనుకున్న వెంటనే ఆ అనుభవం గుర్తుకు వస్తుంది. ఎందుకొచ్చిందిలే అని ఆలోచించి ఆ పని విరమించుకుంటారు. ఇదంతా అనుభవం యొక్క ప్రభావమే.

ఇలా ప్రతి జన్మలో ఎన్నో అనుభవాలు పొందుతూ వుంటారు. అవన్నీ ఆత్మలో నిక్షిప్తమై వుంటాయి. అందుకే అటువంటి తప్పు చేయాలనుకున్న వెంటనే లోపల నుంచి చేయకూడదు తప్పు అని అనిపిస్తుంది. అందుచేత పూర్వ అనుభవం వల్ల కొంతమంది తప్పులు చెయ్యమన్నా చెయ్యరు. కొంతమంది చెయ్యాలనుకున్నా చెయ్యలేరు. కొంతమంది చుట్టూ వున్న సమాజ ప్రభావంతో ఆ తప్పు చేస్తూ వున్నా అంటే మాంసం తింటూ వున్నా! ఎవరైనా అది తప్పు, పాపం అని చెప్పగానే వెంటనే మానేస్తారు. కానీ కొంతమంది ఎంత చెప్పినా, ఎన్ని సార్లు చెప్పినా మానరు. కారణం అనుభవం కాలేదు కనుక.

ఇక్కడ అనుభవాలు రెండు రకాలు. (1) ప్రత్యక్ష అనుభవం, (2)పరోక్ష అనుభవం. ప్రత్యక్ష అనుభవమంటే పాపం చేసిన వెంటనే పడే శిక్ష. ఇది ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. కారణం ఆ పని చెయ్యబట్టే ఈ శిక్ష పడింది అన్నది చూసారు కాబట్టి.

కానీ పరోక్ష అనుభవం అంటే ఇప్పుడు మాంసం తిన్నారు కానీ ఏమీ జరగలేదు. కానీ ఈ పాప కారణంగా భవిష్యత్తులో ఏక్సిడెంటు జరగవచ్చు, ఏదైనా తీవ్ర రోగం బారిన పడవచ్చు. కానీ ఆ కష్టం తాను గతంలో మాంసం తినడం వల్ల వచ్చింది అన్నది వారికి తెలియదు. అందుచేత దానికి వేరే కారణం చెప్పుకుంటారు. ఆ కష్టం పోగానే మరల ఆ పాపం చేస్తూనే వుంటారు. మాంసం తింటూనే వుంటారు. కారణం తాను పొందింది పరోక్ష అనుభవం కాబట్టి.

ఒకవేళ బుద్ధుడు, కృష్ణుడు, పత్రీజీ లాంటి వారు నీ హింసాత్మకమైన పాపాలే నీ రోగాలు అని చెప్పినా, మనస్సులో అవునేమో అని అనిపిస్తూ వుంటుంది కానీ ఆ పని మాత్రం మానలేరు. కారణం తాను పొందింది పరోక్ష అనుభవం కాబట్టి.

కానీ సృష్టిలోని 'కర్మ సిద్ధాంతం' అనుసరించి అలాంటి పరోక్ష అనుభవాలు పొందగా, పొందగా కొన్నాళ్ళకు అంతర్మథనం జరుగుతుంది. ఎందుకు ఈ కష్టం వచ్చింది? ఏమిటి ఈ బాధ? ఇలా ఎందుకు జరుగుతుంది? నేనేం తప్పు చేయలేదు కదా? నేనేం పాపం ఎరగను కదా? ఎందుకు ఈ కష్టం వచ్చింది? ఒకవేళ ఆ పెద్దలు చెప్పిందే నిజమేమో? మాంసం తినడం వల్లనే ఈ కష్టం వచ్చిందేమో? లేకపోతే వారు ఈ విషయం ఎందుకు చెపుతారు? నాకే ఎందుకు చెపుతారు? అలా చెప్పడం వల్ల వారికి వచ్చిన లాభమేమిటి? అదే కారణమేమో? అసలు తినకపోతే నష్టమేమిటి? మానేస్తే పోలా? ఏదో ఒక ఆహారం దొరుకుతుంది కదా? ఆ జంతువుల్నే తినాలా? నిజంగా చూస్తే అవి కూడా బాధపడుతున్నాయి కదా? వాటి బాధ కూడ నాకు కలిగిన బాధ లాంటిదే కదా? అది కూడా ప్రాణమున్నదే కదా? వద్దు వద్దు అని అరుస్తుంది కదా? ఏడుస్తుంది కదా? పారిపోతుంది కదా? బాధలేకపోతే అలా ఎందుకు చేస్తుంది?

నా చేయి తెగితే ఎలాంటి బాధ కలుగుతుందో? దాని పీక తెగినా

దానికి కూడా అలాంటి బాధే కలుగుతుంది కదా? అనవసరంగా దాన్ని బాధించడమెందుకు? ఆ పాప ఫలితంగా నేను బాధపడడమెందుకు? తినడం మానేస్తే పోలా? అని రకరకాలుగా ఆలోచిస్తూ వుంటారు.

అలా కష్టం కలిగినపుడు రోగంతో బాధపడుతున్నప్పుడు బాధ భరించలేనపుడు, అంతర్మథనం ద్వారా పరోక్ష కారణాన్ని తెలుసుకుంటారు. ఇక ఆ పని చెయ్యరు, ప్రవర్తన మార్చుకుంటారు. ఇదంతా పరోక్ష అనుభవం వల్ల జరిగిందే.

ఏది ఏమైనా కష్టాలు అనుభవం కోసమే. అలా అనుభవం పొందిన వారు మరల తప్పులు చేయరు. ఒకవేళ తప్పు చేస్తున్నారంటే ఇంకా అనుభవం పొందలేదని అర్థం.

ఏదైనా చేసిన కర్మలు ఎందుకు అనుభవించాలి? అంటే అనుభవం పొందటానికే, మార్పు చెందటానికే, సృష్టిలోని సత్యం తెలుసుకోవడానికే. అంతా ఒకటే! అన్నీ ఒక్కటే! అని తెలుసుకోవటానికే. అందరూ నాలాంటి వారే అని తెలుసుకోవటానికే, అందరిని తనతో సమానంగా చూడటానికే.

అనుభవం పొందకపోతే తప్పులు చేస్తూనే వుంటారు, ఇతరులను కష్టపెడుతూనే వుంటారు, ఇతరులకు హాని చేస్తూ వుంటారు, ప్రవర్తనలో మార్పు రాదు. పాపాలు చేస్తూనే వుంటారు, అధర్మంగా ప్రవర్తిస్తుంటారు, సృష్టి విరుద్ధమైన పనులు చేస్తూ వుంటారు.

ఈ అనుభవాలు ఎందుకు? అంటే పాఠాలు నేర్చుకోవడానికి అని తెలుసుకున్నాం. అలా ఒక్కొక్క అనుభవం ద్వారా ఒక్కొక్క పాఠం నేర్చుకుంటారు. ఒక్కొక్క పాఠం ద్వారా ఒక్కొక్క తప్పు సరి చేసుకుంటారు. అలా ఎన్నో జన్మలు తీసుకుని ఎన్నో పాఠాలు నేర్చుకుని ఎన్నో తప్పులు సరి చేసుకుంటారు. ప్రవర్తన మార్చుకుంటారు. మంచిగా మారతారు.

అందుకే భూలోకాన్ని పాఠాలు నేర్చుకునే ఒక పాఠశాలతో పోలుస్తారు. అలా భూలోకమనే పాఠశాలలో ప్రతి జన్మలో ఎన్నో పాఠాలు నేర్చుకుంటారు.

అందుచేత తెలుసుకోండి... పాఠాలు నేర్చుకోవాలంటే అనుభవాలు పొందాలి. అనుభవాలు పొందాలంటే కర్మలు చెయ్యాలి. అందుకే శ్రీ కృష్ణ పరమాత్మ కర్మలు చెయ్యడం మానవద్దు అన్నారు.

శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫలహేతుర్భూర్మాతే సఙ్గోస్త్వ కర్మణి (భ.గీ.2-47)

తా:- అర్జునా! నీకు కర్మను చేయుట యందే అధికారము కలదు. కానీ, కర్మ ఫలము ఆశించుట యందు నీకధికారము లేదు. కర్మఫలమునకు నీవు కారణభూతుడవు కారాదు. అట్లని కర్మలు చేయుట మానరాదు.

ఇక్కడ శ్రీ కృష్ణుల వారు కర్మలు చేయడం మానవద్దు అన్నారు. మరి కష్టాలు వచ్చేటప్పుడు కర్మలు ఎందుకు చెయ్యడం? అన్న సందేహం కూడా వస్తుంది. కానీ కర్మలు చేయడం వల్ల, కష్టాలు అనుభవించడం వల్ల, అనుభవం పొంది పాఠాలు నేర్చుకుంటారు. తప్పులు సరి చేసుకుంటారు. ఎవరికీ తన జీవితంలో అటువంటి బాధ రానివ్వరు. ఇదంతా జీవితంలో ఎదగడానికే. అందుకే శ్రీ కృష్ణుల వారు కర్మలు చేయడం మానవద్దు అన్నారు.

అవి చెడుకర్మలైనా, మంచి కర్మలైనా మొత్తం మీద కర్మలు చేస్తూనే వుండాలి. పాప కర్మలు చేసినా, కష్టాలతో అనుభవం సంపాదించి పాఠాలు నేర్చుకుని, పరివర్తన చెంది జీవితంలో మార్పు తెచ్చుకుంటారు. అందుకే కర్మలు చెయ్యమన్నారు.

మనం పిల్లలకు శిక్షలు వేసి ఎలా పాఠాలు నేర్పుతామో! మంచి మార్గంలో పెడతామో! సృష్టి కూడా మనకు కష్టాలు ఇచ్చి పాఠాలు నేర్పిస్తుంది. మనల్ని మంచి మార్గంలో పెడుతుంది. తద్వారా అందరూ, అన్ని జీవులు ఆనందంగా వుండాలనే తన ఆశయం నెరవేర్చుకుంటుంది. అసలు జీవితమే పాఠాలు నేర్చుకోవడానికి.

అంతేకానీ జీవితమంటే సంపాదించడానికి, సంపాదన పెంచు కోవడానికి, సంతానం కనడానికి, సుఖాలు అనుభవించటానికి కాదు. తన సుఖాల కోసం ఇతరుల సుఖాన్ని, ఆనందాన్ని హరించడానికి కాదు. అలా హరిస్తూ ఇతరులను దుఃఖానికి గురి చేస్తూ, వారికి అశాంతిని కలిగిస్తూ జీవితాన్ని ముగించుకోవడం కోసం కాదు. అందుకే జీవితంలో ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. ఎన్నో తెలుసుకోవాలి. సృష్టి నియమాలు తెలుసుకోవాలి. ఎంతో జ్ఞానం సంపాదించుకోవాలి.

మరి ఈ పాఠాలు ఎందుకు నేర్చుకోవాలి? అంటే జ్ఞానం

సంపాదించుకోవడానికి అని తెలుసుకున్నాం.

అలా జీవితంలో ఎన్నో జన్మలు పాఠాలు నేర్చుకున్న తరువాత వారిలో అంతర్మథనం మొదలవుతుంది. ఆలోచిస్తారు... ఏమిటి ఈ కష్టాలు? ఎందుకు ఈ కష్టాలు? ఈ కష్టాలు ఎందుకు వస్తున్నాయి? ఈ పుట్టడమేమిటి? చావడమేమిటి? చనిపోయిన వాడు ఏమవుతున్నాడు? ఎక్కడకు వెళతాడు? వెళ్ళిన వాడు మరలా వస్తాడా? రాడా? వస్తే ఎప్పుడు వస్తాడు? ఎలా వస్తాడు? అసలు ఈ కష్టాలు లేకుండా చేసుకోలేమా? కష్టాలు పోవాలంటే ఏం చెయ్యాలి? కష్టాలు రాకుండా వుండాలంటే ఏం చెయ్యాలి? ఈ మానవులందరి జీవితం ఒకేలా ఎందుకు లేదు? కొందరికి కష్టాలు! కొందరికి భోగాలు! కొందరికి దుఃఖం! కొందరికి ఆనందం! కొందరికి రోగాలు! కొందరికి సంతోషం! ఇలా రకరకాలుగా జీవితాలు ఎందుకు వున్నాయి? లాంటి ఎన్నో రకాల సందేహాలు ఆలోచనలు మొదలవుతాయి. వారికి ఇదంతా అయోమయంగా కనిపిస్తుంది. అర్థం కాదు. కానీ తెలుసుకోవాలనే ఆసక్తి వుంటుంది.

అప్పుడు అనిపిస్తుంది. అసలు ఎందుకు ఈ జీవితం? దేనికి ఈ జీవితం? ఏం చేయటానికి ఈ జీవితం? ఈ జీవితంలో ఏం చేయాలి? అన్న ప్రశ్నలు తలెత్తుతాయి.

అపుడు వారు కొంతమంది గురువులను, పెద్దలను కలుస్తారు. వారిని ప్రశ్నించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలనుకుంటారు. అలాగే కొన్ని ఆధ్యాత్మిక పుస్తకాలు చదువుతారు. స్వామి వివేకానంద, రమణ మహర్షి, మెహర్‌బాబా లాంటి వారి పుస్తకాలు, భగవద్గీత, బైబిలు, ఖుర్‌ఆన్ లాంటి పుస్తకాలు చదువుతారు. అప్పుడు వారికి ఆ గురువుల వల్ల, పుస్తకాల వల్ల కొద్ది కొద్దిగా సమాధానాలు దొరుకుతూ వుంటాయి.

వారు ఏమి చెపుతారంటే నువ్వు అజ్ఞానంలో వున్నావు అందుకే నీకు ఇదేమీ అర్థం కావటం లేదు. అజ్ఞానంతో చేసే పనుల వల్లే నీకు కష్టాలు వస్తున్నాయి. ఇటువంటి కష్టాల నుంచి బయటపడాలంటే నువ్వు జ్ఞానం సంపాదించుకోవాలి. జ్ఞానం సంపాదించుకుంటేనే నీకు అన్నీ తెలుస్తాయి. అన్ని సమస్యలు పరిష్కరించుకోగలుగుతావు. నీకు పుట్టి–చచ్చే వరకు వున్న జీవితమే కాదు, చనిపోయిన తరువాత కూడా నీకు జీవితం వుంది. ఈ సృష్టిలో కనిపించే

ఈ భోలోకమే కాదు. ఇంకా కోటానుకోట్ల లోకాలు వున్నాయి. భూమి మీద కనిపించే మానవులు, ఇతర జీవులే కాదు. ఇతర లోకాలలో కూడా ఎన్నో రకాల జీవులు వున్నారు.  నీకు భూమి మీద కనిపించే వాటి కంటే ఎన్నో వింతలు, విశేషాలు, ఆ లోకాలలో వున్నాయి. భూమి మీద నీకు కనిపిస్తున్నది, నీవు తెలుసుకున్నది చాలా స్వల్పం, నీవు తెలుసుకోవలసింది చాలా వుంది.

శరీరం వదిలిన తరువాత మానవులు శరీరం లేకుండా పరలోకాలలో వుంటారు. ఇదంతా ఆ పరలోక జ్ఞానం పొందితే తెలుసుకుంటావు కానీ నీవు పరలోక జ్ఞానం తెలుసుకోవట్లేదు. పరలోకాల గురించి ఆలోచించటం లేదు. అందువల్ల  సృష్టి గురించి నీకు తెలిసింది చాలా స్వల్పం. నీవు తెలుసుకోవలసింది, నీవు పొందవలసిన జ్ఞానం అనంతం. అదంతా తెలుసుకుంటే తప్ప నీవు ఈ గందరగోళం నుంచి బయటపడలేవు. అందుచేత జ్ఞానం సంపాదించుకో. అన్నీ తెలుసుకో అని చెబుతారు.

వారు ఇంకా ఏమంటారంటే ఈ జీవితంలో జరిగే సంఘటనలన్నీ నీవు నేర్చుకోవటానికే.  ఈ సంఘటనలు, కష్టాలు నీకు ఎన్నో పాఠాలు నేర్పుతాయి.

అలా జీవితంలో ఎన్ని ఎక్కువ పాఠాలు నేర్చుకుంటే అంత ఎక్కువ జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు,  తద్వారా ఎలా ప్రవర్తించాలో అంటే ఏమి చెయ్యాలి? ఏమి చేయకూడదు? అన్నది తెలుస్తుంది. అలా జ్ఞానం పెరిగే కొద్దీ చేయకూడని పనులు చేయవు. కష్టాలు అనుభవించవు. అలాగే చేయవలసినవి చేసి జీవితాన్ని సరి చేసుకుంటావు. ఆనందంగా జీవిస్తావు అని చెపుతారు.

అందుచేత ఎవరైనా తెలుసుకోవలసిందేమిటంటే? జ్ఞానం పొందకపోతే అజ్ఞానంలో వుంటారు. అజ్ఞానంలో వుండడం వలన ఏ పనులు చేయకూడదో, ఏ పనులు చేయాలో తెలియక చేయకూడని పనులు, సృష్టి విరుద్ధమైన పనులు, ధర్మవిరుద్ధమైన పనులు చేస్తారు. అందరికీ నష్టం కలిగిస్తారు. తాము నష్టపోతారు. ఇతరులను నష్టపెడతారు.

మరి అలాంటి పనులు ఎందుకు చేస్తారు? అంటే అలాంటి పనులు చేస్తే వచ్చే నష్టమేమిటో?  చేయపోతే వచ్చే లాభమేమిటో? అన్న జ్ఞానం లేకపోవడమే. కానీ ప్రతీ జన్మలో అనుభవం ద్వారా కొన్ని పాఠాలు నేర్చుకోవడం

ద్వారా అనుభవంతో ఆ జ్ఞానం పొందుతారు. అందుకే పత్రీజీ "అనుభవమే జ్ఞానం" అన్నారు. అంతకు ముందు ఇతరులు చెప్పినా అర్థం కాదు కనుక చేయకూడని పనులు చేస్తూనే వుంటారు. తెలిసినా కూడా తప్పులు చేస్తూ వుంటారు.

జ్ఞానం లేకపోవడం వల్ల తెలిసినా తప్పులు చేస్తూంటారు అన్న దానికి ఒక చిన్న ఉదాహరణ చూద్దాం.

ఎవరినైనా అబద్ధం ఆడవచ్చా? అని అడిగితే ఆడకూడదు. అబద్ధమాడటం తప్పు అని అంటారు. కానీ ప్రతి రోజూ ఎన్నో అబద్ధాలు ఆడేస్తూ వుంటారు. ప్రతి చిన్న విషయానికి ఉత్తినే అబద్ధాలు చెప్పేస్తూంటారు. సరదా కోసం కూడా అబద్ధాలు చెపుతూ వుంటారు. అబద్ధాలు చెపుతూ పరిహాసానికి అలా అన్నా అని కూడా అంటారు.

అదే జ్ఞానం వున్న స్వామి వివేకానందని తీసుకోండి. ఆయన అబద్ధమాడతారా? అంటే ఎటువంటి పరిస్థితుల్లో కూడా అబద్ధమాడరు. ఇతరులకు తేడాగా చెప్పరు, లేనిది చెప్పరు. ఉన్నది ఉన్నట్టుగా చెపుతారు. ఎటువంటి పరిస్థితులలో కూడా అబద్ధమాడరు. కారణం ఆయన జ్ఞాని. ఆయనకు తెలుసు అబద్ధమాడితే కలిగే నష్టమేమిటో? తరువాత దాని ఫలితం ఎంత నష్టాన్ని కలిగిస్తుందో? అబద్ధమాడి ఇతరులను మోసగించడం ఎంత సృష్టి విరుద్ధమైన పనో? దాని ఫలితం తాను ఏ విధంగా అనుభవించవలసి వస్తుందో? ఆయనకు తెలుసు.

అంతేకాదు ఎవరైనా నమ్మిన వారికి అబద్ధం చెప్పి మోసగిస్తే వారు ఎంత బాధపడతారో? అన్న జ్ఞానం ఆయనకు వుంది. అందుచేత ఆయన ఎటువంటి పరిస్థితులలో అబద్ధమాడరు.

కానీ సామాన్యులు తెలిసి కూడా ఈ పని ఎందుకు చేస్తున్నారు? అంటే అబద్ధాలు ఎందుకు చెబుతున్నారు? అంటే జ్ఞానం లేకపోవడమే. జ్ఞానం లేకపోవడం వల్లే తప్పులు చేస్తున్నారు, తాము నష్టపోతున్నారు, ఇతరులను నష్టపెడుతున్నారు.

కానీ లోకంలో ఎంతో మంది పెద్దల వల్ల, గురువుల వల్ల, వారి ఉపన్యాసాల వల్ల ఎన్నో విషయాలు, ధర్మాలు తెలుసుకుంటున్నారు. కానీ అలా

ఊరికే తెలుసుకోవడం వల్ల ప్రయోజనం వుండదు. చాలా మందికి చాలా విషయాలు తెలుసు. కానీ అన్నీ ఆచరిస్తున్నారా? అంటే లేదనే ఖచ్చితంగా చెప్పవచ్చు. కారణం అనుభవం కాలేదు కాబట్టి. అందుచేత "అనుభవ జ్ఞానమే ఆచరణలోకి వస్తుందని తెలుసుకోవాలి". అందుచేత అనుభవం ద్వారా నేర్చుకున్న పాఠాల వల్ల పొందిన జ్ఞానం వల్ల తప్పులు సరి చేసుకోవడమే కాదు, తప్పులు చేయకుండా ఉండగలుగుతారు. అలా జ్ఞానం పెరిగేకొద్దీ జీవితంలో తప్పులు, పాపాలు తగ్గిపోతూ వుంటాయి.

మరి ఈ జ్ఞానం దేనికి? తప్పులు, పాపాలు తగ్గించుకోవడానికి, చేయకుండా వుండడానికేనా? ఇంకా ఏమైనా కారణం వుందా? అంటే ఈ జ్ఞానం ఆధ్యాత్మికంగా, ఆత్మపరంగా ఎదగడానికి అని చెప్పుకున్నాం. ఆత్మ అంటే మనమే కదా? అంటే మనం ఎదగడానికి. అందుచేత మనం ఎంత ఎక్కువ జ్ఞానం సంపాదిస్తే అంత ఎదిగినట్లు లెక్క. మరి ఆధ్యాత్మికంగా, ఆత్మపరంగా ఎదగడం ఎందుకు?

ముందు మనం ఒక విషయం తెలుసుకోవాలి. మనమంతా దేహాలం కాదు, దేహధారులం. అంటే దేహాన్ని ధరించిన 'ఆత్మలం'. అంటే మనమంతా 'ఆత్మలమని' ఇంతకు ముందే తెలుసుకున్నాం.

కానీ లోకంలో అంతా తాము దేహమని భావిస్తూ దేహపరంగా ఎదగడానికి ప్రయత్నిస్తున్నారు. దేహ లాభాల కోసం చూస్తున్నారు. అంటే ధనంలో ఎదగడానికి, ఉద్యోగంలో ఎదగడానికి, వ్యాపారంలో ఎదగడానికి, వృత్తిలో ఎదగడానికి, పదవిలో ఎదగడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ఎదుగుదలలన్నీ దేహసంబంధమైనవి. కానీ తాను 'ఆత్మ' అయినపుడు తాను ఆత్మపరంగా ఎదగాలని తెలుసుకోవాలి. 'ఆత్మ' లాభాలు పొందాలి. 'ఆత్మ' ఎదుగుదలనే ఆధ్యాత్మిక ఎదుగుదల అంటారు.

ఎందుచేతనంటే ప్రాపంచికంగా ఎదగడం వేరు, ఆధ్యాత్మింగా ఎదగడం వేరు. ప్రాపంచికంగా ఎదిగిన వారు ప్రాపంచిక లాభాలే అంటే దేహ లాభాలే పొందుతారు. కానీ ఆధ్యాత్మికంగా ఎదిగిన వారు 'ఆత్మ' లాభాలు పొందుతారు. కానీ మనం ఆత్మలం కాబట్టి 'ఆత్మ' లాభాలే మనకు కలిగే అసలైన లాభాలు. ఈ ఆత్మ లాభాలే మన అంటే 'ఆత్మ' ఎదుగుదలకు ఉపకరిస్తాయి. 'ఆత్మ' ఎదిగే

కొద్దీ అంటే జ్ఞానం పెరిగే కొద్దీ శరీరం వదిలిన తరువాత సృష్టిలో వున్న కోటానుకోట్ల లోకాలలోని ఉన్నత లోకాలకు అంటే ఊర్ధ్వలోకాలకు చేరుకుంటాం. అలా ఊర్ధ్వ లోకాలకు చేరుకోవడమే 'ఆత్మ' ఎదుగుదల.

గమనిస్తే లోకంలో ఒక ఆచారం వుంది. ఎవరైనా మరణిస్తే రెండు రకాల కార్యక్రమాలు చేస్తారు.

(1) స్నేహితులు సంతాప సభ పెట్టి వారి విశిష్ఠతల గురించి చెప్పుకుని వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటిస్తారు.

(2) అలాగే బంధువులు కర్మకాండ చేస్తారు. కారణం దేహం వదిలిన 'ఆత్మ' అంటే వారు ఈ భూలోకాన్ని వదలి పరంలో ఉన్నతలోకాలకు అంటే ఊర్ధ్వ లోకాలకు చేరుకోవాలని అంటే ఉన్నత గతులు పొందాలని. అంటే అంతకు ముందు ఉన్నలోకం నుంచి ఇంకా ఉన్నత లోకం పొందాలనే ఉద్దేశ్యంతో కర్మకాండలు చేస్తారు. ఇదంతా ఎందుకు చేస్తున్నారు? అంటే పోయిన వారు 'ఆత్మ' కాబట్టే. 'ఆత్మ' ఎదుగుదల కోసమే ఈ తతంగాలన్నీ.

ఇక్కడ తెలుసుకోవలసింది ఏమిటంటే? కానీ వారి కోసం మరొకరు చేసే ప్రార్థనల వల్ల కానీ, కర్మకాండల వల్ల కానీ 'ఆత్మ'కు ఏ ప్రయోజనం చేకూరదు. 'ఆత్మ' ఎదగాలన్నా, 'ఆత్మ' ఉన్నత లోకాలు చేరాలన్నా, జీవించి వున్నప్పుడు వారి దేహంతో చేసే సాధనల వల్ల, జీవితంలో నేర్చుకునే పాఠాల వల్ల సంపాదించుకున్న జ్ఞానం వల్లనే ఆత్మ ఎదుగుతూ ఉన్నత లోకాలు చేరుకుంటుంది.

మరి ఆత్మ ఎదుగుదల ఎందుకు? ఆత్మ ఎదగకపోతే ఏమైనా నష్టముందా? అంటే ఆత్మ ఎదుగుదల జీవిత గమ్యం చేరడానికి. జీవిత లక్ష్యం సాధించటానికి అని చెప్పుకున్నాం. మరి జీవిత గమ్యం ఎందుకు చేరుకోవాలి? జీవిత లక్ష్యం ఎందుకు సాధించాలి?

## గమ్యం - లక్ష్యం

జీవితానికి గమ్యము ముఖ్యమే. లక్ష్యము ముఖ్యమే. మన గమ్యమేమిటో మనకు తెలియకపోతే మన జీవిత ప్రయాణం ఎటు సాగించాలి? అన్నది ఎలా తెలుస్తుంది? అలాగే మన ప్రయాణం ఎటు సాగుతుంది? ఎటు వెళుతున్నాం?

అన్నది ఎలా తెలుస్తుంది? అసలు మన దారి ఏది? ఇప్పుడు ఏ దారిలో ప్రయాణిస్తున్నాం? సరైన దారిలో ప్రయాణించకపోతే చేసిన ప్రయాణమంతా వృధాయేకదా? శ్రమ అంతా వృధాయే కదా? అందుచేత ముందు మన గమ్యమేమిటో తెలుసుకోవాలి. దానికి సరైన మార్గదర్శకులను అనుసరించాలి. గొర్రెలు తన కాపరిని అనుసరించినట్లు. జీవిత ప్రయాణం సాగించేవాడు కూడా తన కాపరిని అంటే సరైన దారిలో నడిపించగలిగే గురువును పట్టుకోవాలి. లేకపోతే వాడి బతుకు కాపరి లేని గొర్రెలానే వుంటుంది.

## కాపరి లేని గొర్రెలు

కాపరి లేని గొర్రెలు గమ్యం తెలియని బాటసారులులాంటివి.



నడిపించే వారు లేకపోతే గొర్రెలకు ఎటు వెళ్ళాలో తెలియదు. ఎక్కడ ఆహారం దొరుకుతుందో తెలియదు. దారి తప్పే ప్రమాదం వుంది. ఆపదలలో చిక్కుకునే అవకాశం వుంది. చివరకు చిక్కుల్లో పడి కష్టాల పాలవుతాయి.

అలాగే మానవుని జీవితంలో కూడా సరైన మార్గం అంటే ధర్మమార్గం, సత్యమార్గం, నీతిమార్గం చూపించేవారు లేకపోతే ఏమి చేస్తున్నాడో తెలియదు? ఏది చెయ్యాలో తెలియదు? చెయ్యకూడనివే చేస్తాడు, చివరకు దుఃఖానికి లోనవుతాడు, కష్టాల పాలవుతాడు.

అంటే ఒక రకంగా ప్రస్తుతం సమాజంలో కాపరి లేని గొర్రెలలా ప్రజలు జీవిస్తున్నారు. వారి గమ్యమేమిటో? వారికి తెలియదు. వారి లక్ష్యం ఏమిటో? వారికి తెలియదు. ఏమి చేస్తున్నారో, ఎటు ప్రయాణిస్తున్నారో తెలియదు, అంతా అస్తవ్యస్తం, అపసవ్యం, అంతా లోక విరుద్ధం. ఒకరకంగా దారి తెలియని, గమ్యం తెలియని బాటసారుల లాంటి వారు. అంటే కాపరి లేని గొర్రెల వంటి వారు.

అందుకే జీసస్‌ను కాపరి అన్నారు. కాపరి అంటే గొర్రెలను కాయడం కాదు, గొర్రెలను కాసేవాడని అర్థం కాదు. అందరినీ సరైన మార్గంలో నడిపించే వాడని అర్థం, రక్షించేవాడని అర్థం, నష్టపోకుండా చూసేవాడని అర్థం, శాంతిగా,

సుఖంగా, ఏ లోటు లేకుండా జీవించేలా చేసేవాడని అర్థం, తప్పు దారి పట్టకుండా, నష్టపోకుండా చేసేవాడు అని అర్థం.

అలాగే భూమి మీదకు వచ్చిన యోగీశ్వరులందరూ అంటే శ్రీ కృష్ణుడు, బుద్ధుడు, మహమ్మద్, గురునానక్, మహావీరుడు, పత్రీజీ లాంటి వారంతా కాపరులే. మానవులను సరైన మార్గంలో నడిపించడానికి వచ్చిన వారే. దుఃఖంలో పడకుండా చూడటమే కాదు, దుఃఖంలో చిక్కుకున్న వారిని దుఃఖం నుంచి బయటపడేలా చేయడానికి వచ్చిన వారే వీరంతా. దుఃఖనివారణా మార్గం తెలుసుకున్న కాపరులే. ఎవరైతే వీరిని అనుసరిస్తారో, వారి మార్గంలో పయనిస్తారో వారంతా తప్పనిసరిగా దుఃఖం నుంచి బయటపడతారు. అందుచేత వారి మార్గంలో నడిచేవారంతా కాపరి వున్న గొర్రెలు. వారి మార్గంలో నడవని వారంతా కాపరి లేని గొర్రెలు.

అలాగే జీవితానికి ఒక లక్ష్యం కూడా వుంటుంది. మన జీవిత లక్ష్యమేమిటో తెలియకపోతే మనం సాధించవలసిందేదో తెలియకపోతే మన జీవితంలో ఏమి చెయ్యాలో ఎలా తెలుస్తుంది? ఏం చేస్తున్నామో? చేసేది సరైనదా? కాదా? ఎలా తెలుస్తుంది? మన లక్ష్యమేమిటో మనకు తెలియకపోతే, అంటే మనం సాధించవలసిందేదో మనకు తెలియకపోతే, మనం సాధించినవన్నీ, సాధించాలనుకునేవన్నీ వ్యర్థమే కదా? మనం పడిన శ్రమ, కష్టం అంతా వృధాయే కదా?

మనం ఏవేవో చేసేసి, సంపాదించేసి, సాధించి పొంగిపోతూ వుంటాం, గొప్పగా భావిస్తాం, గర్వపడతాం, గొప్పలు చెప్పుకుంటాం. కానీ అన్నీ వ్యర్థమే కదా? సాధించవలసింది ఒకటి... సాధించింది మరొకటి. ప్రయోజనమేమిటి? సాధించినదంతా వ్యర్థమే కదా? సమయం, శక్తి ఆఖరికి జీవితమే ఎంత వృధా చేసుకున్నట్టు. అందుచేత మన శక్తియుక్తులు, జీవితం వృధా కాకూడదంటే ముందు మన జీవిత లక్ష్యమేమిటో? తెలుసుకోవాలి. లక్ష్యదిశగా మన ప్రయత్నం వుండాలి. మన పనులు మన లక్ష్యాన్ని సాధించేవిగా వుండాలి. మన కృషి ఆ రకంగా వుండాలి. దానికి సరైన గురువును ఆశ్రయించాలి. వారి ద్వారా మనం చేయవలసిందేమిటో తెలుసుకోవాలి. ఆ సాధనలు చెయ్యాలి. మన

సమయం, శక్తి, జీవితం దానికి వెచ్చించాలి. విశేషమైన కృషి చెయ్యాలి. తద్వారా లక్ష్యాన్ని తేలికగా సాధించగలుగుతాం. జీవితాన్ని సద్వినియోగం చేసుకోగలుగుతాం.

జీవిత లక్ష్యం సాధించకుండా జీవిత గమ్యం చేరుకోలేరు. జీవిత గమ్యం చేరుకోకపోతే మరల మరల భూమి మీదకు రావాలి అంటే జన్మలు తీసుకోవాలి. జీవిత ప్రయాణం అలాగే కొనసాగిస్తూ వుండాలి. ఇలా ఎంత కాలం? అంటే గమ్యం చేరేదాకా మరి మన జీవిత గమ్యమేమిటి? మన జీవిత లక్ష్యం ఏమిటి? గమ్యం అన్నది ప్రయాణానికి సంబంధించినది, లక్ష్యం అన్నది సాధించవలసినది. అందుచేత మన (ఆత్మ) జీవిత ప్రయాణంలో చేరవలసిన గమ్యం ఏమిటి? మన (ఆత్మ) జీవితంలో సాధించ వలసినది ఏమిటి? అన్నది తెలుసుకుందాం.

**"భూమి మీదకు వస్తున్న మన (ఆత్మ) గమ్యం సత్యలోకం చేరడం".** ఈ గమ్యం అంటే సత్యలోకం చేరే దాకా మనం మరల, మరల భూమి మీదకు



వస్తూనే వుంటాం. జీవిత ప్రయాణం సాగిస్తూనే వుంటాం.

అలా వస్తూ పోతూ వుంటే నష్టమేమిటి? అనుకోవచ్చు. అందుకే శ్రీ ఆదిశంకరాచార్యులు వారు యీ విధంగా చెప్పడం జరిగింది.

**పునరపి జననం, పునరపి మరణం**
**పునరపి జననీ జఠరే శయనమ్**
**ఇహ సంసారే బహుదుస్తారే**
**కృపయాపారే పాహీ మురారే !!**

తా:- మళ్ళీ మళ్ళీ పుట్టడం, మళ్ళీ మళ్ళీ చావడం, మళ్ళీ, మళ్ళీ తల్లి గర్భంలో పడడం. ఈ విధమైన చావు, పుట్టుకల సంసారం కడు దుర్భరంగా వుంది. దయా స్వరూపుడైన వాడా నన్ను కృపతో రక్షించి కాపాడు.

పై శ్లోకం ద్వారా శంకరాచార్యుల వారి సందేశం ఏమిటంటే అలా చచ్చి పుడుతూ దుఃఖం అనుభవించడం కాదు. అటువంటి జీవితం నుండి బయటపడాలని సందేశం ఇస్తున్నారు.



అంటే చచ్చి పుట్టే జీవితం కాదు చావు పుట్టుకలు లేని స్థితి పొందాలని ఆయన సందేశం.

ఆ స్థితి మన గమ్యం అంటే సత్య లోకం చేరినపుడే సాధ్యమవుతుంది. అలా సత్యలోకం చేరినపుడు ఇక మనం భూలోకం రావలసిన పని వుండదు. ఈ విషయమే భగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది.

**శ్లో॥ ఆబ్రహ్మ భువనా ల్లోకాః పునరావర్తినోర్జున ।**
**మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే ॥ (భ.గీ.8-16)**

తా:- ఓ అర్జునా! ఆ బ్రహ్మ లోకాల్లాంటి లోకాలకు చేరుకున్నా తిరిగి భూలోకానికి రావలసిందే. కానీ నేనున్నటువంటి లోకానికి (సత్యలోకానికి) చేరుకుంటే తిరిగి జన్మించవలసిన పనిలేదు. అంటే భూలోకానికి రావలసిన అవసరం లేదు.

శ్రీ కృష్ణులవారు చెప్పిన దానిని బట్టి మన గమ్యం సత్య లోకమని అర్థమవుతుంది. అంటే ఒక రకంగా నది సముద్రం చేరినట్టు. మనం సత్యలోకంలో వుండే పూర్ణాత్మను చేరాలి.

# నది - సముద్రం

నది ఎంతదూరం ప్రయాణించినా, ఎంతకాలం ప్రవహించినా, ఎన్ని ఇబ్బందులు పడుతూ ప్రవహించినా, ఎన్ని వంపులు తిరుగుతూ, ఆటంకాలు అధిగమిస్తూ చివరకు సముద్రానికి చేరేవరకు, తన ఉనికి కోల్పోయే వరకు ప్రయాణం కొనసాగించవలసిందే! ప్రవహించవలసిందే! బాధలు పడవలసిందే! సముద్రం చేరితే ఆ నది యొక్క ప్రయాణం ఆగిపోతుంది. అంటే సముద్రం చేరడమే నది గమ్యం.

అలాగే మానవుడు ఎన్ని జన్మలు తీసుకున్నా, ఎంతకాలం జీవించినా, ప్రతీ జన్మలో ఎన్ని ఇబ్బందులు పడినా, ఎంత దుఃఖం అనుభవించినా, ఎన్ని కష్టాలు అధిగమించినా చివరకు 'నేను' అనే అహంకారం, 'నాది' అనే మమకారం కోల్పోయి, సత్యలోకంలోని పూర్ణాత్మను చేరేంతవరకు జీవిత ప్రయాణం కొనసాగించవలసిందే. బాధలు పడవలసిందే. చివరకు దైవత్వాన్ని సాధించి ఆఖరి జన్మలో ప్రవేశించినా కూడా రాముడిలాగ, కృష్ణుడిలాగ, బుద్ధుడు లాగ,

జీసస్ లాగ బాధలు పడవలసిందే.

నది తన ఉనికి కోల్పోయినట్టే. మానవుడు కూడా జీవిత ప్రయాణంలో తన ఉనికి కోల్పోవాలి. అంటే 'నేను, నాది' అన్నవి కోల్పోవాలి. దానికి ధ్యానం చెయ్యాలి.

చూడండి నదిలా వుంటే ఒక ఆకారం వుంటుంది. దానికి ఒక పేరు కూడా వుంటుంది. సముద్రానికి చేరగానే, అంటే గమ్యం చేరగానే నామరూపాలు కోల్పోతుంది.

అలాగే మానవుడు సత్యలోకం చేరగానే అంటే జీవిత గమ్యం చేరగానే నేను, నావి అన్నవి కోల్పోతాడు. మరొక ఉదాహరణ చూద్దాం.

# స్వగృహం

ఎవరైనా తన స్వగృహం వీడి ఎక్కడికి వెళ్ళినా సుఖశాంతులు పొంద లేరు. కానీ తన స్వగృహం చేరగానే సుఖశాంతులు పొందగలరు. అందుకే దేహంతో వున్న మానవుడు ఎక్కడికి వెళ్ళినా తిరిగి తన స్వగృహం చేరుకోవాలనే చూస్తాడు.

అలాగే ఆత్మ తన స్వగృహమైన సత్యలోకంలోని పూర్ణాత్మను వీడి ఏ లోకం చేరినా శాశ్వతశాంతి పొందలేదు. తిరిగి తన స్వగృహమైన సత్యలోకం చేరినపుడే శాశ్వత శాంతిని పొందగలదు. అదే ఆత్మ యొక్క లక్ష్యం అంటే మానవ జీవిత లక్ష్యం.

ఆత్మ ఎల్లప్పుడూ కాంక్షించేది. తిరిగి తన స్వగృహం చేరుకోవాలనే.

మరి మన గమ్యం ఎపుడు చేరగలుగుతాం? అంటే మన జీవిత లక్ష్యం సాధించినపుడు. మరి మన జీవిత లక్ష్యం ఏమిటి? ఒక శ్రీ కృష్ణునిలా, బుద్ధునిలా, జీసస్‌లా, మహమ్మద్‌లా, మహావీరునిలా, బ్రహ్మర్షి పత్రీజీలా పూర్ణాత్మ కావడమే. అప్పుడే మనం వారిలా సత్యలోకానికి చేరుకోగలం.

ఇక్కడ మనం మరికొన్ని విషయాలు తెలుసుకోవాలి. అలా పూర్ణాత్మగా తయారైన వారినే కోక్రియేటర్స్ అంటారు. వారు తమ నుంచి కొన్ని అంశలను సృష్టించి, ఈ అంశలను అంటే అంశాత్మలను ఒక జీవుడిలో అంటే శరీరంలో ప్రవేశపెడతారు. అలా శరీరంలో ప్రవేశపెట్టబడిన అంశాత్మనే 'జీవాత్మ' లేక 'జీవుడు' అంటారు.



ఈ జీవుడికి ఆ పూర్ణాత్మ ఒక 'లక్ష్యం' నిర్దేశిస్తుంది. నువ్వు కూడా నాలాగ నా స్థాయికి ఎదగాలి. అంటే పూర్ణాత్మ కావాలి. అలా పూర్ణాత్మగా ఎదిగే దాకా నువ్వు జన్మలు తీసుకుంటూనే వుంటావు. నా స్థాయికి అంటే పూర్ణాత్మగా ఎదిగిన తరువాత నన్ను చేరుకుంటావు. అంటే నేనుండే సత్యలోకానికి చేరుకుంటావు. అపుడు ఇక జన్మలు తీసుకోవలసిన అవసరం వుండదు అని జీవుడికి లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. తల్లి ఎంతమంది బిడ్డలను కన్నా తల్లి తల్లిలాగే వుంటుంది. ఏ మాత్రం తరిగిపోదు. అలాగే పూర్ణాత్మ నుండి ఎన్ని అంశలు విడి వడినా పూర్ణాత్మ పూర్ణంగానే వుం టుంది. ఏమీ తరగదు. ఒకరకంగా పూర్ణాత్మ, అంశాత్మ రెండూ ఒక్కటే.

అందుకే దశావతారాలను అంటే శ్రీరాముడు, శ్రీ కృష్ణుడు, బుద్ధులను విష్ణుమూర్తి యొక్క అంశలని చెప్పుకుంటాం. అంటే విష్ణుమూర్తిగానే చెప్పుకుంటాం. అలాగే షిరిడిబాబాను శివుని అంశగా చెపుతారు. బాబాయే శివుడని కూడాఅంటారు.

అలాగే తల్లి నుండి జన్మిం చిన బిడ్డ మరల తానూ తల్లిగా ఎదిగి తాను కూడా బిడ్డలను ఎలా కంటుందో! అలాగే పూర్ణమైన ఆత్మ నుండి విడివడిన అంశ విద్యచేత అంటే జ్ఞానం చేత తాను కూడా పూర్ణాత్మగా ఎదుగుతుంది. తన జీవిత లక్ష్యాన్ని సాధిస్తుంది. మరల తాను కూడా పూర్ణాత్మ పాత్రను పోషిస్తుంది. అంటే మరల తాను కూడా అంశలను సృష్టిస్తుంది.

ఈ విషయమే "ఈశావాశ్య ఉపనిషత్తులో" చెప్పబడింది.

**శ్లో॥ ఓమ్ పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥**

తా:- అది పూర్ణం అంటే బ్రహ్మం పూర్ణము. ఇది పూర్ణం (ఇది అంటే పూర్ణాత్మ నుండి విడివడి జీవుడిలో ప్రవేశించిన జీవాత్మ) అంటే 'జీవాత్మ' కూడా పూర్ణమే. ఆ పూర్ణ వస్తువు నుండి అంటే బ్రహ్మం నుండి ఈ పూర్ణ వస్తువు అంటే 'జీవుడు' కలిగాడు. ఈ పూర్ణ వస్తువు అంటే జీవుడు విద్యచేత (జ్ఞానం చేత) పూర్ణత్వాన్ని సాధించిన పక్షంలో పూర్ణమైన పరమాత్మగా శేషిస్తుంది. అంటే బ్రహ్మంగా విలసిల్లుతుంది. అంటే పూర్ణాత్మగా తయారవుతుంది. అంటే సహ సృష్టికర్త (కో్రియేటర్) అవుతుంది.

అందుచేత మనం దేహాలము కాదు, దేహంలో వున్న 'దేహి'లం అంటే 'జీవులం'. అంటే ఆత్మలం. మన లక్ష్యం పూర్ణ జ్ఞానాన్ని సంపాదించుకుని పూర్ణాత్మగా తయారు కావడం. మన గమ్యమైన సత్యలోకం చేరడం. సహ సృష్టి కర్తగా వుంటూ సృష్టికర్త చేస్తున్న పనులు చేయడమే మన పని.

అందుకే ఈశావాశ్య ఉపనిషత్‌లోని శాంతి మంత్రంలో ఆది అంటే సృష్టికర్త పూర్ణమే. సృష్టి కర్త నుండి విడివడి జీవుడుగా మారిన అంశ కూడా పూర్ణమే అని చెప్పబడింది. అంతేకాదు ఈ జీవుడు విద్యలచేత అంటే జ్ఞానం చేత మరల తాను పూర్ణత్వాన్ని పొందిన పక్షంలో తాను కూడా పూర్ణంగానే భాసిస్తుంది అంటే శేషిస్తుంది అని చెప్పబడింది.

మరి జీవుడికి ఆ విద్య అంటే జ్ఞానం ఎలా లభిస్తుంది? ఈ విషయమే పూర్ణాత్మ స్థితికి ఎదిగిన బ్రహ్మర్షులు అయిన వశిష్టుల వారు, శంకరాచార్యులు లాంటి వారు చెప్పడం జరిగింది. వారు ఏమి చెప్పారంటే ఎవరయితే (1) ధ్యాన సాధన, (2) స్వాధ్యాయం (జ్ఞానవంతమైన పుస్తకాలు చదవడం), (3) సాంగత్యం (ఆత్మజ్ఞానుల బోధలు వినడం) విశేషంగా చేస్తారో వారు అనతి కాలంలోనే పూర్ణ జ్ఞానాన్ని పొంది జీవిత లక్ష్యమైన పూర్ణాత్మగా ఎదుగుతారని చెప్పడం జరిగింది.

ఈ విషయమే మన బ్రహ్మర్షి పత్రీజీ కూడా చెపుతున్నారు. అందుచేత మన జీవిత లక్ష్యం ఖానా, పీనా, సోనా కాదు. సాధన, స్వాధ్యాయ, సాంగత్యాల ద్వారా పూర్ణాత్మలు కావడమని తెలుసుకుందాం. అనునిత్య ధ్యాన సాధన చేద్దాం.

ఆత్మలమైన మనం ఎదగడం దేని కంటే? గమ్యం చేరడానికి, లక్ష్యం సాధించడానికి.

మనం పూర్ణాత్మ నుండి వచ్చాము. లక్ష్యం, పూర్తి అయ్యేదాకా జన్మలు తప్పవని గుర్తు పెట్టుకోవాలి. అందుచేత లక్ష్యం సాధించి గమ్యం చేరుకోవాలి.

ఇంతటి జ్ఞానాన్ని, ధ్యాన మార్గాన్ని మనకి అందించిన బ్రహ్మర్షి పత్రీజీకి ధన్యవాదాలు. లేకుంటే మనమంతా గమ్యం తెలియని బాటసారులే? పత్రీజీ ఎంతోమందికి ఈ జ్ఞానాన్ని తెలియచేశారు. లేకపోతే మనం మరల, మరల జన్మలు ఎత్తాల్సి రావడమే కాదు, ఎత్తిన జన్మలు వృధా చేసుకుంటాం కూడా.

అందుచేత తెలుసుకోండి ఈ జీవితమన్నది సంపాదించుకోవడానికి, సంసారాన్ని పోషించుకోవడానికి, సుఖాలు అనుభవించడానికి, దుఃఖంలోంచి, కష్టాలలో నుంచి బయటపడే ప్రయత్నం చేస్తూ జీవితం ముగించుకోవడానికి కాదు. అలా జీవించడం మన లక్ష్యం కాదు, మరణించడం మన జీవిత గమ్యం కాదు.

ఈ జీవితానికి గమ్యము వుంది, లక్ష్యము వుంది. అందుచే ఆ దిశగా ప్రయత్నించాలి, సాధించాలి. అలా ప్రయత్నించి సాధించిన వారే గొప్పవారు. అటువంటి వారే జీవితాన్ని సద్వినియోగం చేసుకున్నవారవుతారు.

ఇదంతా ఇంకా బాగా అర్థం కావాలంటే ఆధ్యాత్మిక త్రిరత్నాలైన (1)ధ్యాన సాధన, (2) జ్ఞానుల పుస్తకాలు స్వాధ్యాయం చెయ్యడం, (3) జ్ఞానులతో సాంగత్యం చెయ్యడం చెయ్యాలి. పత్రీజీ మార్గంలో నడవాలి.

# “సాంఖ్యయోగం ... పంచ వింశతి”

**“వింశతి” = “వందలో అయిదవ భాగం”**

“పంచ” = “అయిదు”

కనుక “పంచ వింశతి” అంటే “ఇరవై అయిదు”.

పురుష-ప్రకృతుల కలయికే “సృష్టి” = “25 తత్త్వాలు”

ఇరవై అయిదు తత్త్వాలతో కూడుకుని వుంది ఈ “సృష్టి” సమస్తం
“పురుషుడు” అంటే మూలచైతన్యపు శకలం – అంటే “జీవుడు”
అంటే, “జీవాత్మ”, లేక “అంశాత్మ” అన్నమాట.

**జీవుడు = పురుషుడు+కారణశరీరం+సూక్ష్మశరీరం+స్థూల శరీరం**

25=1+2+17+5

“పురుషుడి” యొక్క సంఖ్య = “ఒకటి”
ఇరవై నాలుగు తత్త్వాలతో కూడుకుని వుంది “ప్రకృతి”
ప్రకృతిలో ప్రవేశిస్తూ జీవుడు మూడు శరీరాలను ధరిస్తాడు.

**కారణ శరీరం(2)**  **సూక్ష్మశరీరం(17)**  **స్థూల శరీరం(5)**


కారణ శరీరం యొక్క సంఖ్య=“రెండు=2 =“చిత్తం”+“అహంకారం”
సూక్ష్మశరీరం యొక్క సంఖ్య=5+5+5+1+1’=17
సూక్ష్మశరీరం = పంచతన్మాత్రలు–5 + పంచ జ్ఞానేంద్రియాలు–5
+ పంచ కర్మేంద్రియాలు–5 + మనస్సు–1 + బుద్ధి–1
“తన్మాత్రలు” అన్నవి పంచ మహాభూతాల యొక్క సూక్ష్మరూపాలు
స్థూల శరీరం యొక్క సంఖ్య 5. అవే పంచ మహాభూతాలు
కనుక, ఈ భౌతిక లోకంలో భౌతిక దేహధారి అయిన జీవుడి సంఖ్య=25

**“పంచ వింశతి = 25”**

మనిషి భౌతిక పరంగా చనిపోయినప్పుడు అతని సంఖ్య 25–5=20
సూక్ష్మలోకాల నుంచి కారణలోకాలకు పోయినప్పుడు అతని సంఖ్య 20–17=3
ఆత్మజ్ఞానం కలిగినప్పుడు –అంటే, అహంకారం నశించి చిత్తం పరిశుద్ధమైనపుడు
అతని సంఖ్య“3–2=1” అవుతుంది.

**అప్పుడు ఇక హాయిగా ... అద్వైతంగా, పురుషోత్తముడిగా,**
**పరమాత్ముడిగా.. శాశ్వతంగా విలసిల్లుతాడు.**
**ఇదే “కపిల మహాముని” ప్రణీత “సాంఖ్యయోగ” సారాంశం.**

# అనుబంధం



# పత్రీజీ సందేశాలు

# “ఆధ్యాత్మిక విజ్ఞాన శాస్త్రం - ఆరు సిద్ధాంతాలు”

**“ఆత్మ సిద్ధాంతం”**

మనం ఆత్మ స్వరూపులం
మహాకారణలోకాల్లోని ఒకానొక పూర్ణాత్మ యొక్క ఒకానొక అంశాత్మయే మనం

**“జన్మ-పునర్జన్మ సిద్ధాంతం”**

మొదటిసారి అంశాత్మ...ఒకానొక భౌతికశరీరాన్ని ఎంచుకుని ఈ భూమిపై జన్మ తీసుకున్నప్పుడు.. అది “మొదటిజన్మ”. అదే ఆత్మ మళ్ళీ మళ్ళీ జన్మలు తీసుకోవడమే ... “పునర్జన్మలు”.
రకరకాల భౌతిక అనుభవాల కోసం .. “స్వ ఇచ్ఛ” తో
ఈ భూమిపై ఆత్మలు వస్తూ పోతూ వుంటాయి

**“కర్మ – కర్మఫల సిద్ధాంతం”**

మనం చేసే ఏ రకమైన కర్మ అయినా... సమయ సందర్భానుసారంగా
ఆ కర్మకు తగిన ప్రతిఫలానికి ఖచ్చితంగా దారితీస్తుంది
చేసుకున్న వాడికి చేసుకున్నంత మహదేవా

**“పురోగమన సిద్ధాంతం”**

ప్రతి భౌతిక అనుభవమూ ఒకానొక ఆనందాన్నో, దుఃఖాన్నో ప్రసాదించినా
ఒకానొక నిర్దిష్ట జ్ఞానాన్ని మాత్రం తప్పనిసరిగా ప్రసాదిస్తుంది ...
కనుక ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏ క్షణమైనా మరి ఏ పరిస్థితులోనైనా.. ఆత్మకు పురోగమనమే !

**“యోగ సిద్ధాంతం”**

రకరకాల కర్మలు ఆచరిస్తూ, రకరకాల అనుభవాలను గడిస్తూ పురోగమనం దిశగానే పయనిస్తున్న ఆత్మ, తన యొక్క పురోగమనాన్ని మరింత వేగవంతం చేసుకోవడం కోసం చేపట్టే క్రియ అన్నదే “యోగసాధన”. “ధ్యానయోగం”, “స్వాధ్యాయయోగం”, మరి “సజ్జనసాంగత్య యోగం” అన్నవి కొన్ని ఉదాహరణలు.

**“అనేకానేక సిద్ధాంతం”**

సృష్టిలో పుంఖానుపుంఖాలుగా, చిలువలు పలువలుగా అనేకానేక లోకాలూ, అనేకానేకయ జీవులూ, అనేకానేక అనుభవ జ్ఞానాలూ, మరి అనేకానేక అవగాహనా కోణాలూ వున్నాయి; దివ్యచక్షువు ద్వారా తెలుసుకునే సత్యాలే ఇవి.

# "ఆత్మ యొక్క అసలు కథ"

ఆత్మ అన్నది ... ఆద్యంత్యములు లేనిది
ఆత్మ అన్నది ... భౌతికం కాదు
ఆత్మ అన్నది .. మూలచైతన్యపు "శకలం కాని శకలం"
ఆత్మ అన్నది ... భౌతిక రూపులు లేనిది
ఆత్మ అన్నది .. కేవలం "అనుభవ రేఖలు" కలది
ఆత్మ అన్నది .. భౌతిక బరువులు లేనిది
ఆత్మ అన్నది .. కేవలం "అనుభవాల బరువు"ను కలిగివున్నది
ఆత్మ అన్నది .. ఒకానొక "కోరికల పుట్ట"
ఆత్మ యొక్క తపన ఎప్పుడూ నూతన అనుభవాల కోసమే
ఆత్మ యొక్క తపన ఎప్పుడూ భిన్న విభిన్న అనుభవాల కోసమే
ఆత్మకు అన్ని పరిస్థితులూ ఆశ పుట్టించేవే
ఆత్మ అన్నది "అన్ని పరిస్థితులనూ అవగాహన చేసుకోవాలి" అని సదా ఆతృతపడేదే
ఆత్మకు ఓటమి అన్నదే లేదు ... ఒక్క "ఆత్మహత్య" చేసుకున్నప్పుడు తప్ప
("ఆత్మహత్య మహాపాపం" అని చెప్పబడింది కదా; ఇది ఆత్మజ్ఞాన రహితులందరికీ తప్పనిసరిగా, విధిగా వర్తిస్తుంది. అయితే ఒకానొక ఆత్మజ్ఞానికి, ఒకానొక బ్రహ్మజ్ఞానికి బ్రహ్మహత్యాపాతకం లేదు.. ఆత్మహత్యాపాతకం లేదు)
ఆత్మకు ఉన్నదంతా గెలుపే ... ఆత్మకు ఉన్నదంతా నిత్యనూతనత్వమే
ఒకానొక ఆత్మ .. ఒకానొక మానవ శరీర ధారణ చేసినప్పుడు.. ఒకానొక జీవిత స్థితిని ఎదుర్కొంటుంది
ఆ తరువాత ... ఇక రకరకాల జీవిత పరిస్థితులను అనుభవించటానికి ఆరాటపడుతూంటుంది.

మానవ జీవిత పరిస్థితులన్నింటినీ అవగాహన చేసుకోవడానికి
ఆత్మకు కనిష్టపరంగా నాలుగు వందల జన్మలు అవసరం వుంటుంది.
మరి నాలుగు వందల జన్మల్లో ఆరితేరిన ఆత్మ
ఒకానొక 'అనుభవాల పుట్ట'గా తయారవుతుంది.
అనేకమార్లు జన్మించి..అంటే అనేక మార్లు శరీరంలో చేరి
అనేక మార్లు మరణించి.. అంటే అనేక మార్లు శరీరంలోంచి బయటపడి
అనేక రకాల అవమాన-దుఃఖ-తిరస్కారాదులను భరించి
అనేక మార్లు మరణించి .. అంటే అనేకమార్లు శరీరంలోంచి బయటపడి
అనేకసార్లు మాన-సుఖ-పురస్కారాదులను అనుభవించి
ఒకానొక సంపూర్ణ "జ్ఞానపు పుట్ట"గా తయారవుతుంది.
ప్రతి జన్మ కూడా ఆత్మకు అనేకాకానేక అనుభవాలను అందిస్తుంది.
ప్రతి అనుభవం కూడా ఆత్మకు ఒకానొక విశిష్టజ్ఞాన సారాన్ని ప్రసాదిస్తుంది
ఆత్మ అన్నది ... ప్రప్రథమంగా .. ఒక కోరికల పుట్ట
ఆత్మ అన్నది .. పరంపరగా .. ఒక అనుభవాల పుట్ట
ఆత్మ అన్నది .. అంతిమ పర్యవసానంగా ఒక జ్ఞానపు పుట్ట
ఇదీ ఆత్మ యొక్క అసలు కథ
ఓం తత్ సత్

# మౌలిక ఆధ్యాత్మిక సత్యాలు

- సృష్టిలో కోటానుకోట్ల లోకాలు వున్నాయి.
- మనకు ఎన్నో దేహాలు వున్నాయి.
- మూల చైతన్యం నుంచి 'వర్షం'లా ఆత్మల సృష్టి ఎప్పుడూ జరుగుతూనే వుంది... అలా జరుగుతూనే వుంటుంది.
- పూర్ణాత్మలు అంటే పరిణితి చెందిన ఆత్మలు కూడా తమలోంచి నూతన అంశాత్మలను సృష్టిస్తూ వుండటం జరుగుతూ వుంటుంది.
- మూల చైతన్య ఆత్మలు కానీ, పూర్ణాతల నుంచి వచ్చిన అంశాత్మలు కానీ, అన్నీ... రకరకాల అనుభవాలను జనన – మరణ చక్రంలో కానీ, దాని బయట కానీ – విధిగా సంపాదించుకోవాలి.. శైశవ దశ ఆత్మలు అన్నీ విధిగా పరిణామ క్రమంలో పూర్ణపరిణితి చెందాల్సిందే.
- ఆత్మలకు ఎప్పుడూ పూర్తి "ఇచ్ఛా– స్వేచ్ఛ" వుంటుంది.
- తమ తమ "ఇచ్ఛా–స్వేచ్ఛ"ల వల్ల రకరకాల కర్మలను చేస్తూ, చేస్తూ వాటి వాటి ఫలితాలను అనుభవిస్తూ, అనుభవిస్తూ ఎన్నో పాఠాలను నేర్చుకుంటూ నేర్చుకుంటూ వుండటం అన్నది సదా జరుగుతూ జరుగుతూ వుంటుంది.

▲ **ఇటువంటి సత్యాలు ఇంకా, ఇంకా ఎన్నో వున్నాయి.**
**అన్నీ ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ తెలుసుకుంటూ వుండాలి.**

# అంశాత్మ - పూర్ణాత్మ

మనం "అంశ" పుత్రులం
మనం అంతా "ఋషి పుత్రులం"
మనం అంతా "క్రింద" వున్న ఆత్మలం

"సత్యలోకాలలో" అంటే "మహాకారణలోకాలలో" వున్న
"ఒకానొక 'పూర్ణాత్మ' యొక్క ఒకానొక అంశ " మనం అన్నమాట
"అంశాత్మ" ... "పూర్ణాత్మ"

ఎప్పుడైతే మనం పూర్తిగా ఆత్మ పరిణితి చెందుతామో
అప్పుడు మనం కూడా ఆ మహాకారణ లోకాలను చేరుతాం
అప్పుడు మనం కూడా మనలో నుంచి నూతన అంశాత్మలను సృష్టి చేస్తాం
అంటే మనమూ "పూర్ణాత్మ" స్థితి చేరుతామన్నమాట

ముండకోపనిషత్‌లో ఈ విధంగా వుంది :
**"ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే**
**తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్నన్యో అభిచాకశీతి ॥" (3.1.1)**
"రెండు పక్షులు ... అంటే అంశాత్మ, పూర్ణాత్మ
ఎప్పుడూ ఒకే చెట్టుమీద... అంటే శరీరం మీద .. కలిసి ఉంటాయి
రెండూ అందమైన ఈకలతో ఒకే రకంగా ఉంటాయి
వాటిలో ఒకటి తియ్యటి పండ్లను తింటుంది
రెండవది దేనినీ తినకుండా ఊరకనే చూస్తూ కూర్చుని ఉంటుంది"

- ▲ **ధ్యానంలో పరాకాష్ట అంటే పూర్ణాత్మతో అనుసంధానం కలిగి వుండడం**
- ▲ **"పూర్ణాత్మ" అంటే "ద్వా సుపర్ణా" అనే ఋగ్వేద వాక్యాలలో వున్న "రెండవ పక్షి" అంటే "పైన వుండే పక్షి" అన్నమాట.**

# బ్రహ్మ మానస పుత్రులు

ఎప్పుడైతే మనం కూడా
పూర్ణాత్మ స్థితికి చేరగలమో చేరుతామో
అప్పుడు మనం కూడా
మనలో నుంచి అంశలను వేరుగా ఏర్పరచగలం
వీరే "బ్రహ్మ-మానస-పుత్రులు"

అప్పుడు మనం కూడా
వాళ్ళను 'క్రింద' వున్న కారణలోకాలకు పంపి
ఒక ప్రక్క
మన స్వంత పనులను మనం చూసుకుంటూనే
మరో ప్రక్క
వారి బాగోగులను కూడా చూసుకుంటూ ఉండడం జరుగుతుంది.

వీరు కూడా యథావిధిగా
"జనన-మరణ చక్రం"లో చేరి పాఠాలన్నీ నేర్చుకోవలసిందే
ఎవరి స్వేచ్ఛ ప్రకారం వారు విహరిస్తూ వుంటారు ...
విధిగా పురోగమిస్తూనే వుంటారు

మనం పూర్ణాత్మలుగా మారిన తర్వాతే మన స్వంత
మానస పుత్రులను సృష్టించడం  సాధ్యమవుతుంది.

▲ **ప్రతి పూర్ణాత్మా ఒకానొక 'బ్రహ్మ'**
**అందుకే మానసపుత్రులు "బ్రహ్మ మానసపుత్రులు"**

# బ్రాహ్మణులు - ద్విజత్వం

బ్రాహ్మణులే "ద్విజులు"
తమ తమ పూర్ణాత్మలతో అనుసంధానం
పొందినవారే "ద్విజులు"

"బ్రహ్మ జానాతి ఇతి బ్రాహ్మణః"
"బ్రహ్మజ్ఞానం ఉన్నవారే బ్రాహ్మణులు"

అంతే కానీ
మామూలు పుట్టుక ద్వారా ఎవ్వరూ "బ్రాహ్మణులు" కాజాలరు

"ద్విజత్వం" అంటే "రెండవ పుట్టుక"
మొదటి పుట్టుక శారీరకంగా తల్లిదండ్రుల నుంచి
పుట్టడాన్ని సూచిస్తుంది ... మన భౌతిక కాయాన్ని సూచిస్తుంది
మొదటి పుట్టుక ద్వారా అందరూ బ్రాహ్మణేతరులే! అందరూ శూద్రులే!
రెండ పుట్టుక మన "ఆత్మ" గురించి మనకు ఎరుక పరుస్తుంది
ద్విజయోగసాధన ద్వారానే ద్విజత్వం లభిస్తుంది.

జీసస్ అన్నాడు :
"నేను దేవుని కుమారుడను" అని
అంటే, తాను "ఒకానొక పూర్ణాత్మ యొక్క ఒకానొక అంశ" అని
తెలిసిన వాడు అన్నమాట
ప్రతి జీవి ఒకానొక పూర్ణాత్మ యొక్క ఒకానొక అంశే!

▲ **తాము 'అంశాత్మలం' అని తెలుసుకున్న వాళ్ళే బ్రాహ్మణులు, ద్విజులు**

# ఆత్మజ్ఞానం-బ్రహ్మజ్ఞానం

"ఆత్మజ్ఞానం" అంటే "ఆత్మ గురించి జ్ఞానం"
అంటే మన గురించి మనం తెలుసుకోవడం
"నేను భౌతిక శరీరం మాత్రమే కాదు, ఆత్మను కూడా" అని తెలుసుకోవడం
"నేను మూల చైతన్యం" అని తెలుసుకోవటం
ఇదంతా మరి ధ్యానం వల్ల మాత్రమే సాధ్యం

ఆత్మజ్ఞానం అన్నది "తొలిమెట్టు" అయితే, బ్రహ్మజ్ఞానం అన్నది "తుదిమెట్టు"
"బ్రహ్మజ్ఞానం" అంటే "సకల చరాచర సృష్టి రహస్యాల యొక్క జ్ఞానం"
కోటానుకోట్ల లోకాల గురించి వీలయినంత సుస్పష్ట విజ్ఞానం

"ఆత్మజ్ఞానం" లేనిదే "బ్రహ్మజ్ఞానం" అన్నది అసంభవం
ఒకానొక ఆత్మఆత్మజ్ఞానిని "ఋషి" అంటాం .. "ద్రష్ట" అంటాం
ఒకానొక బ్రహ్మజ్ఞానిని "బ్రహ్మర్షి" అంటాం

స్వంత పూర్ణ నిజ స్థితిని తెలుసుకున్నవాడు ఒకానొక "ఆత్మజ్ఞాని"
బయటి ప్రకృతిని కూడా పూర్ణంగా అర్థం చేసుకున్నవాడే ఒకానొక "బ్రహ్మజ్ఞాని"

బ్రహ్మజ్ఞాని అయినప్పుడే 'బ్రహ్మ పదవి' లభిస్తుంది
"బ్రహ్మ" అంటే "సృష్టికర్త – క్రియేటర్" అని
అతను కొన్ని ఆత్మలనూ, కొన్ని లోకాలనూ సృష్టి చేయగలవాడు
సకల లోక జ్ఞాని అయినవాడే నూతన లోకాలను సృష్టించగలడు...
"సహసృష్టికర్త – కో–క్రియేటర్" కాగలడు.

▲ **ఆత్మజ్ఞానం అన్నది ధ్యానం ద్వారా లభించే దివ్యచక్షువు యొక్క ప్రాథమిక స్థితి.**

▲ **బ్రహ్మజ్ఞానం అన్నది దివ్యచక్షువు యొక్క పరమ పరిపక్వతా స్థితి.**

# నిర్వాణం తర్వాత?

“నిర్వాణం”
అంటే “దుఃఖ రాహిత్య స్థితి”
నిర్వాణం తరువాత కూడా స్థితులు వున్నాయి
తరువాత వున్నది జన్మ రాహిత్య స్థితి
తదనంతరం సృష్టికర్త స్థితి
అంటే
తనలోంచి నూతన అంశాత్మలను సృష్టించగల స్థితి
మరికొన్ని లోకాలనూ సృష్టించగల స్థితి

కనుక
“నిర్వాణం” అన్నది మొట్టమొదటి స్థితి
తదనంతరం రెండు స్థితులు వున్నాయి.
అవి “పరి నిర్వాణం”.. మరి “మహాపరినిర్వాణం”

| | | |
|---|---|---|
| నిర్వాణం | పరినిర్వాణం | మహాపరినిర్వాణం |
| దుఃఖరాహిత్యం | జన్మరాహిత్యం | సృష్టికర్త పదవి |
| ఋషి | రాజర్షి/మహర్షి | బ్రహ్మర్షి |
| అరిహంత్ | బోధిసత్వ | బుద్ధ |

గౌతమ బుద్ధుడు బోధివృక్షం క్రింద ధ్యానం పూర్తిచేసిన
తరువాత “నేను మహాపరినిర్వాణం పొందాను” అన్నాడు.

▲ **గౌతమబుద్ధుడు పొందిన అత్యున్నత మహాపరినిర్వాణ స్థితిని ఒకానొక బ్రహ్మర్షి స్థితిని మనం కూడా పొందాలి.. అదే మన ధ్యేయం**

# దివ్యజ్ఞానప్రకాశం

"మనం ఏమిటి?"

"మనం ఎవరం?"

"ఎక్కడి నుంచి వచ్చాం?"

"ఎక్కడి పోతున్నాం?"

"ఎందుకోసం పుట్టాం?"

"చనిపోయిన తరువాత ఏమౌతుంది?"

"అసలు సంఘటనలు ఎలా జరుగుతున్నాయి?"

"ఈ జనన-మరణ చక్ర పరమార్థం ఏమిటి?

" 'దైవం' అంటే ఏమిటి? '

" ఈ అద్భుత సృష్టిక్రమం అంతా ఎలా సాగుతోంది?"

... ఇలాంటి ప్రశ్నలన్నింటికీ

పరిపూర్ణమైన సమాధానాలు స్వానుభవంతో తెలుసుకుని

తదనుగుణంగా జీవింటమే "దివ్యజ్ఞాన ప్రకాశం కలిగి వుండడం" అంటే

▲ **ధ్యానం ద్వారా ప్రత్యక్షంగా మరి ధ్యానుల అనుభవాలు వినడం ద్వారా ధ్యానుల పుస్తకాలు చదవడం ద్వారా పరోక్షంగా అందరికీ పరిపూర్ణ దివ్యజ్ఞానప్రకాశం అనతి కాలంలో కలుగుతుంది.**

# పూజారి.. - .. పూర్ణాత్మ

"పూజారి"

"భక్తి" పేర ఆకులనూ, పువ్వులనూ తాను కోస్తూ,
ఇతరులచే కోయిస్తూ "ప్రకృతిని నాశనం చేసేవాడు"
చిన్నపిల్లలు బొమ్మలతో ఆడుకున్నట్లు,
పెద్ద బొమ్మలైన విగ్రహాలతో ఆడుకునే "పెద్దబాలుడు"

"మంత్రోపాసకుడు"

సాధనను నమ్ముకున్నవాడు
కొంచెం ఎదిగినవాడు.. బొమ్మలాటలను వదిలివేసినవాడు
శక్తులన్నీ తనలోనే వున్నాయి అని గ్రహించి
ఆ శక్తులను వెలుపలికి తీయడానికి అత్యంత క్లిష్టతర సాధనలు
చెయ్యపూనుకున్న "సాహసి".

"వేదాంతి"

"ప్రకృతిని నాశనం చెయ్యని పండితుడు"
అయితే, ఆత్మతత్వాన్ని గ్రహించినా,
తనలోనే శక్తులన్నీ వున్నాయని గ్రహించినా,
ఆ శక్తిని వెలుపలికి తీయడానికి ఏ ధ్యాన సాధనా చెయ్యకుండా
తన పదజాలానికీ, వాక్చాతుర్యానికీ తానే ముగ్ధుడయ్యే "వెర్రివాడు"

"ధ్యాన సాధకుడు"

నిజమైన, తెలివైన మనిషి
తనలోనే శక్తులన్నీ వున్నాయని గ్రహించినవాడు

వెంటనే ఆ శక్తులను వెలుపలికి తీయడానికి చేయవలసిన
ఆనాపానసతి – ధ్యానసాధనలో పూర్తిగా నిమగ్నమైనవాడు

“అవధూత”

ధ్యానానుభవాలలో అత్యంత ముందుకు పోయినవాడు
నిరంతరం “ఇతర లోకాలలో సూక్ష్మశరీరయాత్రల ద్వారా తిరిగేవాడు”.
అయితే,
భౌతికలోకాన్నీ, చుట్టుప్రక్కల ప్రజలనూ ఏ మాత్రం పట్టించుకోనివాడు
“పిచ్చివాడు” అని ఈ లోకపు పిచ్చివాళ్ళు అనుకుంటారు.

“సిద్ధుడు”

ధ్యాన పరాకాష్ఠను అందుకుని అష్టసిద్ధులను హస్తగతం చేసుకున్నవాడు
లోకం ఇతని సిద్ధులను చూసి భయపడుతుంది, ఆశ్చర్యపోతుంది

“బుద్ధుడు”

ఆఖరి జన్మలో వున్నవాడు
అందరి సిద్ధత్వానికీ, బుద్ధత్వానికీ దారి చూపేవాడు
నిరంతరం ధ్యాన, జ్ఞాన బోధ చేస్తూ వుండేవాడు
“సిద్ధుడు” అవ్వాలంటే ధ్యానం పరిపూర్ణం అవ్వాలి...
“బుద్ధుడు” అవ్వాలంటే ధ్యాన జ్ఞాన బోధ నిరంతరం చెయ్యాలి.

“ఒకానొక పూర్ణాత్మ”

సత్యలోకంలో “తార”గా శాశ్వతంగా నిలిచిపోయి,
తనలోంచి నూతన అంశాత్మలను సృష్టించి ...
వారిని కూడా జనన–మరణ చక్రంలో ప్రవేశపెట్టి ..
వారు కూడా బుద్ధుళ్ళయ్యేంత వరకు వారి బాగోగులను చూసుకునేవాడు

# "స్పిరిచ్యువల్ సైన్స్-ఆధ్యాత్మిక విజ్ఞానశాస్త్రం"

**"మానవ మనస్సు"** వేరే ... **"మానవ జీవితం"** వేరే

**"మానవ మనస్సు"** చుట్టుప్రక్కల సమాజం నుంచీ మరి చుట్టుప్రక్కల వాతావరణం నుంచీ ఉద్భవిస్తుంది.

అంతేకాక అది భౌతిక శరీరానికి చెందిన **"జ్ఞానేంద్రియాల చట్రం"లో** కూడా అధికంగా తిరుగుతూ వుంటుంది.

అంటే మనం ఏది ఎక్కువగా చూస్తామో... ఏది ఎక్కువగా వింటామో ఏది ఎక్కువగా రుచి చూస్తామో ... వాటి చుట్టే **మనస్సు** ఎక్కువగా పరిభ్రమిస్తూ వుంటుంది.

అయితే **"మానవ జీవితం"** మటుకు గత జన్మల కర్మల మూలాల్లోంచి ఉద్భవిస్తుంది.

ప్రస్తుత వర్తమాన జీవితం .. గత జన్మల **"తరువాతి పుట"**యే కనుక **"అంతకు ముందున్న పుటలు"** అర్థం కాకపోతే **"వర్తమాన పుట"** అర్థం కాజాలదు. **"మానవ ఆత్మవత్-జీవితాన్ని"** అర్థం చేసుకుంటేనే **"మానవ మనస్సు"** మీద ఆధిపత్యం లభిస్తుంది.

ప్రతి మానవ జీవితం కూడా ఉపరితల లోకాల్లో ఉన్న... ఆత్మ తలాల్లో వున్న.. **"మూలాత్మ"** యొక్క **"మరొక విహారయాత్ర"**గా, **"మరొక విజ్ఞానయాత్ర"**గా అర్థం చేసుకున్నప్పుడే **మనస్సు** యొక్క తీవ్రతర ప్రభావం నుంచి మనం క్షేమంగా, సురక్షితంగా బయటపడగలుగుతాం.

వాస్తవానికి ఇహలోకంలో తాత్కాలికంగా జీవిస్తూన్న **"ఆత్మలోకవాసులమే"** మనం. వాస్తవానికి ఇహలోకంలో భౌతికకాయంలో నివసిస్తున్న ఒకానొక **"సనాతన మూలాత్మ"**యే మనం అనేకానేక జన్మల కర్మల, కర్మఫలాల సంస్కారాల జనిత సంకల్పాల ప్రభావాలతో కూడినదే **"ఈ వర్తమాన జీవితం"** రకరకాల వైవిధ్యాలతో నిండి వున్న **"మూలాత్మ"** యొక్క అసలైన తలాల్లోంచి ప్రభవించిన ప్రతివర్తమాన మానవ జీవితం ఒక త్రాసులోనూ... మరి మానవుల సగటు సామాజిక, మానసిక సామూహిక క్షేత్రం మరొక

త్రాసులోనూ... ఈ రెంటికీ మధ్య అంతులేని సమరం
**"మనస్సు"** యొక్క రకరకాల సంఘర్షణలలోంచి...
**"మనస్సు"** యొక్క నిరంతర ఊగిసలాటలోంచి
ఎగిసిపడుతోన్న ఎడతెరిపి లేని ఉత్తుంగ తరంగాల భీకర సాగర స్థితిలోంచి
క్షేమంగా, సురక్షితంగా బయటపడాలంటే
**"మానవ ఆత్మ-జీవితం"** గురించి అర్థం చేసుకోవాలి.
అందుకుగాను ప్రతి మానవుడు **"ఆత్మశాస్త్రం", "ఆధ్యాత్మిక విజ్ఞానశాస్త్రం"**
**"ధ్యానశాస్త్రం"**.. ఇత్యాది గురించి విధిగా తెలుసుకుని తీరవలసిందే.
మన **పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్** ద్వారా ఆవిర్భవించిన
**"జాతీయ ఆధ్యాత్మిక శాస్త్రవేత్తల సదస్సు"** ద్వారా **"స్పిరిచ్యువల్ సైన్స్"ను...**
**"ఆధ్యాత్మిక శాస్త్రాన్ని"** ... మనం దేశవ్యాప్తం, ప్రపంచ వ్యాప్తతం చేస్తున్నాం

**ప్రతి ఒక్కరూ మానవ ఆత్మ-జీవితాన్ని ఇక అవగాహన చేసుకుందురు గాక!**
**ప్రతి ఒక్కరూ మనస్సు మీద విజయాన్ని ఇక పుష్కలంగా పొందుదురు గాక!**
**ప్రతి ప్రాపంచిక మేధావి కూడా ఇక ఇక "స్పిరిచ్యువల్ సైంటిస్ట్" అవుగాక!**


## బ్రహ్మర్షి పత్రీజీ గారి రచనలు (పాకెట్ బుక్స్)

| | | | |
|---|---|---|---|
| 1) ఆనాపానసతి | - రూ.8/- | 9) సత్యసాయిబాబా | - రూ.8/- |
| 2) ధ్యానం వలన లాభాలు | - రూ.8/- | 10) యోగివేమన | - రూ.8/- |
| 3) ధ్యానానుభవాలు | - రూ.8/- | 11) గౌతమబుద్ధుడు | - రూ.8/- |
| 4) ఆత్మ విజ్ఞానం | - రూ.8/- | 12) శ్రీ కృష్ణ సందేశం | - రూ.10/- |
| 5) సంకల్పశక్తి | - రూ.8/- | 13) ఐభజగోవిందం | - రూ.10/- |
| 6) వాక్‌క్షేత్రం | - రూ.8/- | 14) వీరబ్రహ్మేంద్రస్వామి | - రూ.10/- |
| 7) లేదు మరణం | - రూ.8/- | 15) పిరమిడ్ అద్భుతశక్తి | - రూ.10/- |
| 8) పతంజలి ధ్యానశాస్త్రం | - రూ.8/- | 16) జీసస్ క్రైస్ట్ | - రూ.10/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా.
సెల్: 9490171853, 9440309812

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటి భాగం) | - | రూ.130/- |
| 2) జీవితశాస్త్రం (రెండవ భాగం) | - | రూ.130/- |
| 3) జీవిత సత్యాలు | - | రూ.130/- |
| 4) భగవంతుడంటే | - | రూ.130/- |
| 5) సత్యమార్గం | - | రూ.130/- |
| 6) ఆత్మ శాస్త్రం | - | రూ.130/- |
| 7) ధ్యాన శాస్త్రం | - | రూ.130/- |
| 8) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) | - | రూ.130/- |
| 9) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) | - | రూ.130/- |
| 10) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | - | రూ.130/- |
| 11) ధ్యాన శక్తి | - | రూ.130/- |
| 12) తెలుసుకోండి | - | రూ.130/- |
| 13) జీవిత సూక్ష్మాలు | - | రూ.130/- |
| 14) గీతాసందేశం | - | రూ.100/- |
| 15) కర్మ సిద్ధాంతం | - | రూ.80/- |
| 16) ధ్యానమంటే ? | - | రూ.80/- |
| 17) ఆత్మజ్ఞానం ఎందుకు? | - | రూ.70/- |
| 18) జ్ఞాన జ్యోతి | - | రూ.70/- |
| 19) జ్ఞాన కుసుమాలు | - | రూ.70/- |
| 20) దుఃఖ నివారణామార్గం | - | రూ.60/- |
| 21) బ్రహ్మాజ్ఞానం | - | రూ.60/- |
| 22) త్రివిధాలు | - | రూ.60/- |
| 23) ధ్యానం (పత్రీజీ) | - | రూ.60/- |
| 24) ధ్యానం వల్లనే జ్ఞానం | - | రూ.60/- |
| 25) అతీంద్రియ శక్తులు | - | రూ.60/- |
| 26) శాస్త్రాల అర్థం- అంతరార్థం | - | రూ.60/- |
| 27) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | - | రూ.60/- |
| 28) భూతదయే దైవత్వం | - | రూ.60/- |
| 29) ఆలోచించండి | - | రూ.60/- |
| 30) షిరిడీ సాయిసందేశాలు | - | రూ.60/- |
| 31) సంకల్పమంటే? | - | రూ.50/- |
| 32) ఈ జీవితం ఎందుకు? | - | రూ.50/- |
| 33) ఆశ్చర్యం... ఆశ్చర్యం | - | రూ.50/- |
| 34) నిర్వాణ మార్గం | - | రూ.50/- |
| 35) భాగవత సన్నివేశాల అంతరార్థం | - | రూ.40/- |
| 36) మౌన ధ్యానం | - | రూ.40/- |
| 37) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) | - | రూ.130/- |
| 38) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? | - | రూ.20/- |
| 39) శాకాహారమే మానవాహారం | - | రూ.15/- |
| 40) అహింస మరియు శాఖాహారం | - | రూ.15/- |

పుస్తకముల కొరకు :


**తటవర్తి వీర రాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా.

సెల్ : 9440309812, 9490171853



ఈ జీవితం ఎందుకు? అన్నది చాలా మందికి జవాబు దొరకని ప్రశ్నగానే ఉంటుంది. అసలు ఈ జీవిత లక్ష్యం ఏమిటి? అంటే ఈ జీవితంలో ఏం చెయ్యాలి? ఏం సాధించాలి? అసలు జీవిత గమ్యమేమిటి? అంటే ఎక్కడికి ఈ జీవిత ప్రయాణం? చనిపోయే వరకేనా? లేక ఇంకా ఏమైనా వుందా? అసలు ఈ జీవిత ప్రయాణానికి అంతం వుందా? వుంటే ఎప్పుడు అంతమవుతుంది? అంటే ఎక్కడి వరకు ఈ జీవిత ప్రయాణం? అన్నది కూడా చాలా మందికి అర్థం కాదు.

అందుచేత ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవటానికి చేసిన ప్రయత్నమే "ఈ జీవితం ఎందుకు?"

– తటవర్తి వీరరాఘవరావు